

దొమ్మరనంద్యాల వైపు పెన్నానదిలో ఇసుకకోసం వచ్చిన ట్రాక్టర్లు

ఉచితం.. అనుచితం

ప్రజల మేలుకోసం.. ముఖ్యంగా ఇళ్లు కట్టుకునే పేదలకు ఆర్థికభారం తగ్గించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీ.. పెన్నానది పాలిట శాపంగా మారింది. జిల్లాలో పెన్నానది ప్రవహించేంత మేరా ఎక్కడపడితే అక్కడ ఇసుకను తోడేస్తున్నారు. ఇసుకాసురుల అనుచిత ప్రవర్తనతో నదిలో ఉచిత ఇసుక కొద్దిరోజుల్లోనే కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడింది.

- ఊరూరా.. పెన్నానదిని చుట్టుముట్టిన ఇసుక తోడేళ్లు
- అందరూ ఇసుక తోలకం పనుల్లో నిమగ్నం
- చేతులెత్తేసిన అధికారులు

జమ్మలమడుగు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పెన్నానదిని ఇసుకతోడేళ్లు చుట్టుముట్టాయి. ఉచిత ఇసుక పాలసీ అమలులోకి వచ్చినప్పటి నుంచి పగలు, రాత్రి తేడా లేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిపోతోంది. ట్రాక్టర్ల యజమానులు సైతం ఇతర పనులు మానేసి.. పెన్నానదిలో ఇసుకను నింపుకుని తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. గత నెలలో వర్షాల కారణంగా మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీరు విడుదల చేశారు. దీంతో జమ్మలమడుగు మండలం వేపరాల బైపాస్ వద్ద రోడ్డు కోతకు గురైంది. ప్రస్తుతం మైలవరం నుంచి నీటి విడుదల ఆపేశారు. దీంతో వేపరాల బైపాస్ ప్రాంతంలో ట్రాక్టర్లలో ఇసుకను యధేచ్ఛగా తరలిస్తున్నారు. రోడ్డు సక్రమంగా లేకున్నా మళ్లీ ఇసుక దొరుకుతుందో లేదోనని విచ్చలవిడిగా తీసుకుపోతున్నారు.

ఇసుక తరలించడమే పనిగా..

దొమ్మరనంద్యాలలోని పెన్నానదిలో, వేపరాల, మోరగుడి, టీచర్స్ కాలనీ సమీపంలో.. జమ్మలమడుగులోని పొన్నతోటవీధి, అంబవరం, గూడెంచెరువు, దిగువపట్నం కాలనీ తదితర ప్రాంతాల్లో.. పెన్నానది నుంచి రాత్రి, పగలు ఇసుక తరలిస్తున్నారు. కొందరు ఎన్ని పనులు ఉన్నా వదిలేసి వ్యవసాయం పనులున్నా పక్కనబెట్టి ఇసుక తరలించి విక్రయిస్తున్నారు. మరికొందరు ఖాళీ ప్రదేశాల్లో ఇసుకను డంప్ చేస్తున్నారు. అలాగే ప్రొద్దుటూరు రోడ్డులో పెన్నానదికి ఆనుకుని ఉన్న అన్ని గ్రామాల నుంచీ ఇసుక భారీగా తరలిపోతోంది.

అడ్డూ అదుపులేని ట్రాక్టర్లు

ప్రభుత్వం ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా గృహావసరాలకు ఇసుక ఉచితంగా తరలించుకోవచ్చని ప్రకటించడంతో.. ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. ముఖ్యంగా ట్రాక్టర్ల యజమానులు విచ్చలవిడిగా తరలించడం, రోడ్లపై అధిక వేగంతో వెళుతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో రోడ్లపై పెన్నానది పరిసర ప్రాంతాల్లో అడ్డూఅదుపు లేకుండా వెళుతున్న ట్రాక్టర్లతో ప్రజలు భయపడుతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసు అధికారులు కానీ, రెవెన్యూ అధికారులు కానీ ఎవ్వరు పట్టించుకోకుండా చేతులెత్తేసినట్లు తెలుస్తోంది.

ఇప్పటికైనా కలెక్టర్, రెవెన్యూ అధికారులు వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోకపోతే పెన్నానదిలో ఇసుక ఖాళీ అవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గత ప్రభుత్వంలో అక్రమంగా ఇసుక తవ్వకాలతో పెన్నానదిని గుల్ల చేశారని మిగిలిన కాస్తా ఇసుకను ఇప్పుడు మటుమాయం చేస్తున్నారని అంటున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే పెన్నానదిలో కేవలం గులకరాళ్లు పెద్ద పెద్ద గుంతలు మాత్రమే మిగులుతాయని అంటున్నారు.



జమ్మలమడుగు వద్ద పెన్నానదిలో కోతకు గురైన రోడ్డు వద్ద ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు



పెన్నానదిలో నాపరాళ్ల గనుల వద్ద ట్రాక్టర్లలో ఇసుక నింపుతున్న దృశ్యం

పసిడిపురి ఖ్యాతిని పెంచుతాం

- ప్రొద్దుటూరును కార్పొరేషన్ స్థాయికి చేర్చుతాం
- మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున



ఫటాఫట్

ప్రొద్దుటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్పెషల్‌గ్రేడ్ మున్సిపాలిటీ అయిన ప్రొద్దుటూరు పట్టణంలో కలిసిపోయి ఉన్న గ్రామాలను విలీనం చేసి కార్పొరేషన్ స్థాయికి పెంచుతామని.. వాణిజ్య నగరంగా పసిడిపురి ఖ్యాతిని పెంచడానికి కృషిచేస్తానని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. ఆయనతో ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూ.

ప్రశ్న: ప్రొద్దుటూరు అభివృద్ధికి మీ ప్రణాళిక..

జవాబు: ప్రొద్దుటూరు మున్సిపాలిటీని అభివృద్ధి చేయాలంటే పట్టణంలో కలిసి పోయివున్న కొత్తపల్లె, గోపవరం, సోములవారిపల్లె, దొరసానిపల్లె చౌటపల్లె, పెద్ద శెట్టిపల్లె పంచాయతీలను విలీనం చేసి కార్పొరేషన్‌గా మార్చాలి. ఈ పంచాయతీల జనం నిత్యం పట్టణంలో అన్ని సౌకర్యాలు పొందుతున్నారు. ఆదాయం మాత్రం పంచాయతీలకు పోతోంది. దీంతో మున్సిపాలిటీ ఆదాయం కోల్పోతోంది. కార్పొరేషన్‌గా మార్చితే కేంద్రం నుంచి పెద్ద ఎత్తున నిధులు వస్తాయి. అభివృద్ధిని విస్తరించవచ్చు.

ప్రశ్న: డ్రైనైజీ వ్యవస్థ మెరుగుపరిచేందుకు..

జవాబు: ఐదు ప్రధాన చానల్స్ పట్టణం గుండా వెళ్తున్నాయి. ఇవి చాలావరకు ఆక్రమణలకు గురయ్యాయి. పట్టణంలో కలిసి ఉన్న పంచాయతీలకు సరైన డ్రైనేజీ వ్యవస్థలేదు. వీటిన్నింటిని కలిపి నూతనంగా డ్రైనేజీ వ్యవస్థకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. గతంలో పనులు రద్దు కావడంతో రూ.180 కోట్లతో డ్రైన్స్ ఆధునికీకరణ కోసం డీపీఆర్ రూపొందిస్తున్నాం.

ప్రశ్న: పారిశుధ్యంపై ఏం చర్యలు తీసుకోనున్నారు

జవాబు: పట్టణంలో ఇంటింటికి చెత్త సేకరణ 100 శాతం అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. కాలువల్లో పూడిక పేరుకుపోవడానికి కారణమౌతున్న ప్లాస్టిక్‌ను పూర్తిగా నియంత్రించేందుకు కఠిన చర్యలు అమలు చేస్తాం. రోడ్లమీద, కాలువల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తాం.

ప్రశ్న: తాగునీటి సౌకర్యం కోసం..

జవాబు: ప్రతిరోజు 43 ఎంఎల్‌డీ కెపాసిటీ నీళ్లు పట్టణంలో సరఫరా చేస్తున్నాం. మైలవరం నుంచి వాటర్ సోర్స్ ఉంది. ఇంకా 4 తాగునీటి రిజర్వాయర్లతో పాటు ఇంటర్నల్ పైపులైను వేయాల్సి ఉంది. 15 ఫైనాన్స్ నిధుల కింద పైపులైను పనులు చేపడుతున్నాం.

ప్రశ్న: కొత్త మాస్టర్ ప్లాన్ అమలు చేస్తారా

జవాబు: ప్రొద్దుటూరు మాస్టర్ ప్లాన్‌లో గతంలో ఉన్న 36 రోడ్లతో పాటు కొత్తగా మరికొన్ని రోడ్లు విస్తరణ ప్రతిపాదనలో ఉన్నాయి. రోడ్ల విస్తరణతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యను కూడా అధిగమిస్తాం. కొత్తగా కొన్ని పార్కింగ్ ప్రదేశాలు, స్ట్రీట్ ఫుడ్‌సెంటర్స్, ఫ్రూట్ కార్నర్లు ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: అక్రమ కట్టడాలపై ఏం చర్యలు తీసుకోనున్నారు

జవాబు: ఇప్పటికే గుర్తించిన 24 అక్రమ కట్టడాలపై చార్జిషీటు దాఖలు చేశాం. మరో 18 అక్రమ కట్టడాలపై కూడా చార్జిషీటు వేసి భారీగా జరిమానా విధిస్తాం. ఇందువల్ల మున్సిపాలిటీకి రూ.5 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది.

ప్రశ్న: ఆదాయ వనరులు పెంచే కార్యక్రమాలు ఏమిటి

జవాబు: ఇంటిపన్ను, నీటి పన్ను, మార్కెట్, ఎగ్జిబిషన్ లీజువేలం, ట్రేడ్‌లైసెన్సులు, టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఫీజులు సక్రమంగా వసూలు చేస్తాం. అలాగే రిజిస్ట్రేషన్ స్టాంపు డ్యూటీ వసూళ్లు, మున్సిపల్ షాపు రూముల అద్దెలు సకాలంలో వసూలు చేసి ఆదాయం సమకూర్చుతాం. మున్సిపాలిటీలో విలువైన స్థలాల్లో మరిన్ని వాణిజ్య సముదాయాలు నిర్మిస్తాం.

అంతర్‌రాష్ట్ర బైక్ దొంగల అరెస్టు

- రిమాండ్‌కు తరలింపు
- 25 బైక్‌లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైకులు, అరెస్టు అయిన నిందితులతో సీఐ తదితరులు

ఎర్రగుంట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మోటార్ బైక్‌లను దొంగతనం చేస్తూ వాహన దారులకు, పోలీసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్న నలుగురు అంతర్‌రాష్ట్ర దొంగలను ఎర్రగుంట్ల పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. సీఐ నరేశ్‌బాబు కథనం మేరకు.. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం ఉమ్మాయిపల్లెకు చెందిన మొలక గురివిరెడ్డి, బొడ్డు బోయిన నాగేశ్, అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన షేక్ చిన్న హాజీబాషా, పెద్దపప్పూరుకు చెందిన షేక్ ఇమాంహుస్సేన్‌లు చెడు అలవాట్లకు, విలాసాలకు అలవాటుపడి బైక్ దొంగతనాలకు పాల్పడేవారు. ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, గుత్తి, గుంతకల్, డోన్, విజయవాడ, ధర్మవరం, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఖరీదైన మోటార్ బైక్‌లను చోరీ చేసేవారు. ఈనేపధ్యంలో నిందితులు ఎర్రగుంట్ల మండలంలోని ప్రొద్దుటూరు రోడ్డు రామాంజనేయపురం క్రాస్ వద్ద అనుమానాస్పదంగా ఉండగా అదుపులోకి తీసుకుని.. విచారించగా మొత్తం వ్యవహారం బయట పడిందని సీఐ తెలిపారు. వీరి వద్ద నుంచి 25 మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నామమని.. వీటి విలువ సుమారు రూ.25లక్షలు ఉంటుందని తెలిపారు. బైకు దొంగలను పట్టుకోవడంలో కృషి చేసిన ఎర్రగుంట్ల సీఐ పి.నరేష్‌బాబు, ఎస్ఐ నాగమురళి, ఏఎస్ఐ గురుశంకర్, హెడ్‌కానిస్టేబుల్ ఆల్‌ఫ్రెడ్, పోలీసు సిబ్బందిని ఎస్పీ, జమ్మలమడుగు డీఎస్పీలు అభినందించారు.

కడపలో భారీ చోరీ

- 30తులాల బంగారు నగలు, కిలో వెండి అపహరణ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

కడప(క్రైం), నవంబరు8 (ఆంధ్రజ్యోతి): కడప నగరం గంజికుంట కాలనీలో భారీ దొంగతనం జరిగింది. దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోని బీరువాలు ధ్వంసం చేసి 30 తులాల బంగారు నగలు, కిలో వెండి వస్తువులను అపహరించారు. గంజికుంట కాలనీకి చెందిన సయ్యద్ మహ్మద్ ఆలీ కరెంటు ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 6వ తేదిన కుటుంబసభ్యులతో కలిసి బద్వేలుకు వెళ్లి తిరిగి శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చారు. అప్పటికే ఇంటి తాళాలు పగిలిపోయి ఉండడంతో చిన్నచౌకు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై రవికుమార్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలను సేకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

- ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు..
- మేయరు సహకరించారన్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు
- లేదు.. అదంతా అబద్ధమన్న మేయరు
- ఇప్పటికే వైసీపీలో మూడుముక్కలాట
- కడుపులో కత్తులు.. పైకి ఆప్యాయంగా కౌగిలింతలు

వైసీపీలో కలకలం



(కడప-ఆంధ్రజ్యోతి): కడుపులో కత్తులు.. పైకి కౌగలింతలు అనేది కరెక్టుగా కడప వైసీపీ నేతలకు సరిపోతుంది. జిల్లా కేంద్రమైన కడప నగరంలో వైసీపీలో ముగ్గురు ముఖ్యనేతలు ఉన్నారు. వీరిలో ఒకరంటే ఒకరికి పడదు. లోలోపల ఒకరిపై ఒకరికి అపనమ్మకం. ఇది నిన్నమొన్న వ్యవహారం కాదు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అంతకు ముందు కూడా ఇదే పరిస్థితి ఉండేది. కడప కార్పొరేషన్ సర్వసభ్యసమావేశం సందర్భంగా గురువారం కుర్చీలకోసం రచ్చ జరిగింది. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవికి మేయరు పక్కన కుర్చీవేయకుండా ఎనిమిదేళ్లుగా కొనసాగిన ఆనవాయితీకి చెక్‌పెట్టేశారు. ఈ వ్యవహారం సభలో పెద్దదుమారమే రేపి రచ్చగా సాగి చివరికి పాలక పక్షమే బాయ్‌కాట్ చేసే పరిస్థితి వచ్చింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భర్త అయిన పొలిట్‌బ్యూరోసభ్యుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు వైసీపీలో కలకలం రేపాయి. "ఆ పెద్దమనిషి ఎన్నికల్లో మాకు సహకరించారు. జనరల్‌బాడీ మీటింగ్ తొలిసమావేశం రోజున ఆయన లేడు. ఎమ్మెల్యేను కార్పొరేటర్లు సాదరంగా ఆహ్వానించారు. అయితే ఈసారి ఆ పెద్ద మనిషి ఎందుకో ఎమ్మెల్యే కుర్చీ తీసివేశారు" అంటూ మేయరు సురేశ్‌బాబుపై చేసిన వ్యాఖ్యలు వైసీపీలో కలకలం రేపాయి.

ఆ వ్యాఖ్యలతో..

ఐదునెలల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కడప వైసీపీ అభ్యర్థిగా అంజద్‌బాషా.. టీడీపీ నుంచి ఆర్.మాధవి పోటీ చేశారు. వీరిద్దరి మధ్య హోరాహోరీగా ఎన్నికలు జరిగాయి. ఎవరి వ్యూహం ప్రకారం వారు ఓటింగ్‌కు వెళ్లారు. అయితే ఎమ్మెల్యే స్థానాన్ని టీడీపీ గెలుచుకుంది. ఆ ఎన్నికల్లో మేయరు సురేశ్‌బాబు తమకు సహకరించారంటూ ఇన్‌డైరెక్టుగా ఎమ్మెల్యే భర్త, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గురువారం కడప కార్పొరేషన్ కార్యాలయం వద్ద చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. వైసీపీ ఓటమి తరువాత... పలువురు కార్పొరేటర్లు, ముఖ్యనేతలు టీడీపీ అభ్యర్థికి సహకరించారని అప్పట్లోనే పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. ఈ మేరకు హైదరాబాదులోని రాడిసన్ బ్లూ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫిక్సింగ్ జరిగిందని అంటారు. అప్పట్లో దానిని ఎవ్వరూ పెద్దగా పట్టించుకోలేదు. అయితే ఎమ్మెల్యే భర్త వ్యాఖ్యలతో ఒక్కసారి వైసీపీ పాలిటిక్స్ సీనే మారిపోయింది. ఇప్పటి దాకా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయరు సురేశ్‌బాబు ఒక జట్టుగా ఉంటూ వస్తున్నారు. వైసీపీ ఓటమి తరువాత జిల్లాఅధ్యక్ష పదవి నుంచి మేయరు సురేశ్‌బాబును తొలగించి జగన్ తన మేనమామ రవీంద్రనాధరెడ్డికి కట్టబెట్టారు. దీన్ని సురేశ్‌బాబు వర్గీయులు జీర్ణించుకోలేకపోయారు. ఎన్నో ఏళ్లుగా వైఎస్ కుటుంబానికి నమ్మినబంటుగా ఉంటూ బీసీల్లో కీలక వ్యకిగా ఉంటున్న సురేశ్‌బాబును అర్థాంతరంగా పదవి నుంచి తప్పించి మేనమామకు కట్టబెట్టడాన్ని మేయరు సురేశ్‌బాబు వర్గీయులకు మింగుడు పడటం లేదు. అయితే కడపలో పార్టీ కార్యక్రమాలు తమకు తెలియకుండానే అధ్యక్షుడు రవీంద్రనాధెడ్డి అనుచరులు నిత్యానందరెడ్డి, పాకాసురేశ్‌తో పాటు పులి సునీల్‌కుమార్ చేస్తున్నారని.. ఇటీవల పులివెందులకు వచ్చిన జగన్‌కు మేయరు సురేశ్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఫిర్యాదు చేసినట్లు వైసీపీ వారే చెబుతున్నారు. జగన్ మీరంతా కలుపుకునిపోయి పనిచేయండి అంటూ నిత్యానందరెడ్డి, రవీంద్రనాధరెడ్డి అనుచరులకు చెప్పారని సమాచారం. జగన్ వద్ద ఫిర్యాదుతో వీరి మధ్య ఉన్న విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో టీడీపీ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. ఈ మాటలను అంజద్‌బాషా వర్గీయులు కూడా జీర్ణించుకోలేకపోతున్నారని చెబుతున్నారు. అయితే తాను టీడీపీకి అనుకూలంగా పనిచేయలేదని దేవునిపైన ప్రమాణం చేస్తానని మేయరు సురేశ్‌బాబు సవాల్ విసురుతున్నారు. మొత్తానికి ఇప్పుడు వైసీపీలో రాజకీయ కలకలం రేగింది.

నిన్నజరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జనం వైసీపీ ఫ్యాను రెక్కలు విరిచేశారు. కడప పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలుంటే ఐదు స్థానాలను కూటమి అభ్యర్థులకు కట్టబెట్టి వైసీపీ మైండ్ బ్లాక్ అయ్యేలా చేశారు. అప్పట్లో మేయరు సురేశ్‌బాబే వైసీపీ జిల్లా అధ్యక్షుడుగా ఉండేవారు. జగన్ సర్కారుపై జనంలో ఏర్పడ్డ తీవ్ర వ్యతిరేకత గాలిలో తాము ఓడిపోయామని వైసీపీ నేతలు, కేడరు భావిస్తూ వచ్చారు. సొంత జిల్లాలో కూడా ఇంత దారుణమైన ఓటమిని జీర్ణించుకోలేకపోయారు. అయితే టీడీపీ జిల్లా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు వైసీపీలో కలకలం రేపాయి. సొంత పార్టీ నేతలే వెన్నుపోటు పొడిచారా అన్న సందేహం వ్యక్తమవుతుండగా.. కొందరు వైసీపీ నేతలు మాత్రం వైసీపీ శ్రేణుల ఆత్మస్థైర్యం దెబ్బతీసేందుకే ఈ వ్యాఖ్యలు చేస్తున్నారంటూ చెప్పుకొస్తున్నారు.

వైసీపీలో ఆ ఇద్దరిదే హవా..

కడప వైసీపీ మేడిపండు చూడు మేలిమై ఉండు పొట్ట విప్పి చూడు పురుగులుండు.. అన్నచందంగా ఉందంటారు. మేడిపండు తరహాలో వైసీపీ పైకి కనిపిస్తుంది. జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాధరెడ్డి, మేయరు సురేశ్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కడపలో ఆధిపత్యం కోసం పోరాడుతుండడంతో.. ఈ ముగ్గురి మధ్య మూడు ముక్కలాట జరిగేది. అనంతరం మేయరు సురేశ్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు ఒక జట్టుకాగా, రవీంద్రనాధరెడ్డి ఒక వర్గంగా ఉండేవారు. కడప కార్పొరేషన్ తొలి మేయరుగా రవీంద్రనాధరెడ్డి పనిచేశారు. ఆయనకు కడప నుంచి ఎమ్మెల్యేగా పోటీచేయాలన్నది చిరకాల వాంఛ. ఆయన మేయరుగా పనిచేసేటప్పుడు ఆయనకంటూ ఇక్కడ కొంత మంది కార్పొరేటర్లు వెంట ఉండేవారు. ప్రస్తుత పాలకవర్గంలో కూడా వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాధరెడ్డి వర్గీయులుగా డిప్యూటీ మేయరు బండి నిత్యానందరెడ్డి, పాకాసురేశ్ మరికొందరితో పాటు ఆ పార్టీ నేత పులి సునీల్‌కుమార్ మరికొందరు ఆయన వెంట ఉన్నారు. ఇక మాజీ డిప్యూటీ సీఎంకు పలువురు ముస్లిం కార్పొరేటర్లు, నాయకులు వెంట ఉన్నారు. మేయరు సురేశ్‌బాబుకు చిన్నచౌకు ప్రంతానికి చెందిన కార్పొరేటర్లు ఇతర నాయకులు అనుచరులుగా ఉన్నారు. ఈ ముగ్గురు ముఖ్య నేతలు కడపలో ఆధిపత్యం కోసం పోరాడుతుంటారు. అయితే అధికారంలో ఉన్నప్పుడు మేయరు సురేశ్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాదే హవా నడిచిందంటారు. వీరికి పులివెందుల బాస్ కూడా సహకరించారనే చెబుతారు. రవీంద్రనాధరెడ్డికి జగన్ స్వయానా మేనల్లుడు అయినప్పటికీ ఈయనకు ప్రాధాన్యం ఉండేది కాదు. దీన్ని రవిరెడ్డి వర్గీయులు జీర్ణించుకోలేకపోయారంటారు.





6

రైతులకు ఆదర్శం..
శంకర్‌రెడ్డి వ్యవసాయం

గణతంత్ర దినోత్సవ శిబిరానికి పీలేరు విద్యార్థి ఎంపిక



పీలేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ సన్నాహక శిబిరానికి ఎన్‌సీసీ క్యాడెట్ బాలాజీ ఎంపికయ్యాడు. స్థానిక సంజయ్ గాంధీ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ 17 నుంచి 26వ తేదీ వరకు సికింద్రాబాదులో జరగనున్న సన్నాహక శిబిరంలో శిక్షణ తీసుకుంటాడని ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతులకు తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన రైతు

ములకలచెరువు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రైతులు ఆంజనేయులు, పాపిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు... తంబళ్లపల్లె మండలం బందార్లపల్లెకు చెందిన ఆంజనేయులు, కురబలకోట మండలం ముదివేడు వాసి పాపిరెడ్డి కర్ణాటక రాష్ట్రం చింతామణిలో కూరగాయల విత్తనాలు కొనుక్కు రావడానికి బైక్‌లో బయలుదేరారు. బురకాయల కోట వద్ద బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రైతులిద్దరూ తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

హక్కుల కోసమే పోరాటం

మదనపల్లె అర్బన్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): బీసీ హక్కుల పోరాట సమితి పోరాటం ప్రజల కోసమేగాని పదవుల కోసం కాదని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోడెం రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ప్రజల కోసం గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చామన్నారు. రాజ్యసభ సీట్లలో బీసీలకే మొదటి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర గౌరవా ధ్యక్షుడు రామలింగ, రాయలసీమ ఆర్గనైజర్ కార్యదర్శి వెంకటేశ్వరయాదవ్, జిల్లా గౌరవాధ్యక్షుడు పోతబోలు వెంకటరమణ, నేతలు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, నవంబరు 8:(ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ విద్యార్థి యువరాజ్ నాయక్ పురు గుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు దేవతానగర్ వాసి అన్నయ్యనాయక్ కుమారుడు యువరాజ్ నాయక్ ఇంటర్ చదువుతున్నాడు. బైక్ కొనాలనడంతో అమ్మ మందలించిందని మనస్తాపంతో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. తాలుకా సీఐ కేసు నమోదు చేశారు.

రైతులకు ఆదర్శం శంకర్‌రెడ్డి వ్యవసాయం

● ఉష్ణప్రాంతంలోనూ ఆపిల్ పండించిన కృషి

● నూతన పంటల సాగు..అధిక దిగుబడులు

● పక్క రాష్ట్రాలకూ పాకిన వైనం



రూ. 40 లక్షలతో రైతు శంకర్‌రెడ్డి ఏర్పాటు చేసిన పాలీ హౌస్





సాధించిన అవార్డులతో రైతు శంకర్‌రెడ్డి

వాల్మీకిపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం జూదమంటున్న తరుణంలో పలువురు రైతులకు రైతు శివశంకర్‌రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారు. అయ్యవారిపల్లె రైతు శివశంకర్‌రెడ్డి 15 ఎకరాల పొలంలో తరతరాలుగా వస్తున్న వ్యవసాయాన్ని అందిపుచ్చుకుని వేలాది మంది రైతులకు ఆదర్శప్రాయంగా నిలిచారు. 20 ఏళ్ల కిందట తనకున్న రెండన్నర ఎకరాల పొలంలో వేరుశనగ, చెరకు, కూరగాయలు, తదితర పంటలను తనదైన శైలిలో సాగు చేసి అధిక దిగుబడులు రాబడ్డటం, తర్వాత అంచెలంచెలుగా తన మేధోశక్తితో వ్యవసాయాన్ని అభివృద్ధి బాట పట్టించాడు. శీతల ప్రదేశాల్లో పండే ఆపిల్ పంటను సైతం సకాలంలో పండించి శభాష్ అనిపించు కుంటున్నారు. రాజస్థాన్ ప్రాంతం నుంచి తెచ్చిన అన్నా, హరిమాన్ రకాల ఆపిల్ మొక్కలను నాటి కంటికి రెప్పలా కాపాడాడు. అంతే ఏడాదికి ఆపిల్ కాయలు విరగ్గాశాయి. ఉష్ణ ప్రాంతాలకు అనువైన వంగడాలను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేయడంలో ఆసక్తి కనబరిచి ఎన్నో విషయాలను బయటకు తేవడం గమనార్హం. బీడు భూములను వ్యవసాయ భూములుగా మారుస్తూ రైతులకు సైతం ఎన్నో మెలుకువలు నేర్పిన ఘనత శివశంకర్ రెడ్డికి దక్కుతుంది. కేవలం సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారాయన. వివరాల్లోకెళితే...

వాల్మీకిపురం మండలం అయ్యవారిపల్లె రైతు శివశంకర్‌రెడ్డికి 15 ఎకరాల పొలం ఉంది. 2007లో మూడెకరాల్లో కదిరి రకం వేరుశనగ పంట సాగు చేసి అధిక దిగుబడులు రాబట్టాడు. చుట్టుపక్కల గ్రామీణ రైతులు సైతం అప్పట్లోనే ఆశ్చర్యపోతూ శివశంకర్ రెడ్డిని అభినందించడం గమనార్హం. ఇక అప్పటి నుంచి వ్యవసాయమే జీవనాధారంగా రైతు శివశంకర్‌రెడ్డి కుటుంబం శ్రమించ సాగింది. నష్టాలు చవిచూసినా అధైర్య పడక చెరకు, వేరుశనగ, చాందినీపూలు, చామంతి, లిల్లీ (తెలుపు, పసుపు), తదితర పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులు రావడంతో వెను దిరిగి చూసుకోకుండా పరిశోధనాత్మకంగా అనేక రకాల పంటలను సాగు చేయడానికి సిద్ధం చేసుకోవడం గమనార్హం. తన వ్యవసాయ క్షేత్రంలో నాలుగేళ్ల కిందట సాగు చేసిన ఆలీవ్ మొక్కలు ఏపుగా పెరిగి మరో ఏడాదిలో పంట రానుంది. గతేడాది హరిమాన్ 99 రకం యాపిల్ మొక్కలను అధిక పెట్టుబడులతో ప్రయోగాత్మకంగా చేసిన మొక్కలు ఏపుగా పెరిగి యాపిల్ కాయలు విరగ్గాశాయి. దీంతో తిరిగి అదే రకం యాపిల్ మొక్కలను సాగు చేశాడు. దేశంలో అరుదైన మకడమియా డ్రై ఫ్రూట్ పంటను పరిశోధనాత్మకంగా మొదలు పెట్టి సాగు చేయడానికి ముందడుగులు వేస్తున్నారు. ఆ రకం డ్రైఫ్రూట్ కిలో రూ.2వేలకు పైగా పలుకుతుండడం గమనార్హం. చామంతి మొక్కల్లో ఐదురకాలు పెంపకానికి రంగం సిద్ధం చేస్తున్నాడు. అయ్యవారిపల్లె మొదలుకుని రాష్ట్రాలు దాటి వేలాదిమంది రైతు కుటుంబాలకు ఆదర్శంగా నిలిచాడు. నర్సరీల్లో సైతం శివశంకర్‌రెడ్డి వంగడాలు, పూల రకం మొక్కలు తదితరాలకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. ముఖ్యంగా పశువుల ఎరువు, సూక్ష్మపోషక ఎరువుల వాడకంతో పంటల నుంచి అధిక దిగుబడులు రాబట్టవచ్చని చెబుతున్నారు. ఈయన వ్యవసాయ క్షేత్రంలో సుమారు రూ.40లక్షల పెట్టుబడితో ఓ పాలీహౌస్, రూ.7లక్షలతో ఒకటిన్నర ఎకరాలో షైడ్‌నెట్ నర్సరీ నిర్వహిస్తున్నారు. ప్రతి రైతు తన మేధో శక్తితో వ్యవసాయం కుంటుపడకుండా ముందుకెళ్లాలని, తనను కలిసే ప్రతి రైతుకు ఎప్పటికప్పుడు వ్యవసాయ మెలకువలు నేర్పుతున్నానంటున్నారు.

శంకర్‌రెడ్డిని వరించిన అవార్డులు..

2007లో రైతు శివశంకర్‌రెడ్డి అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నుంచి రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు అందుకున్నాడు. 2009లో ఆలిండియా రేడియో ఉత్తమ వ్యాఖ్యాతగా అవార్డు, 2014, 2019లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పూల సాగు రైతుగాను, ఇలా ఎన్నో పురస్కారాలు సొంతం చేసుకున్నారు. ఐదు నెలలుగా విదేశీ శాస్త్రవేత్తల బృందం శివ శంకర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి ప్రశంసించడం గమనార్హం.

ఉష్ణప్రాంతంలో విరగ్గాసిన ఆపిల్

కశ్మీర్.. సిమ్లా... పంటను ఉష్ణ ప్రాంతాల్లో ఆపిల్ పంటను సేంద్రీయ పద్ధతిలో సాగుచేశారు. కేవలం శీతల ప్రాంతాల్లో మాత్రమే పండే ఆపిల్ కరవుప్రాంతంలో విరగ్గాశాయంటే అది రైతు శివశంకర్‌రెడ్డి కృషిగానే చెప్పవచ్చు. రాజస్థాన్ ప్రాంతం నుంచి తీసుకొచ్చిన అన్నా, హరిమాన్ రకాల ఆపిల్ మొక్కలు కంటికి రెప్పలా కాపాడాడు. తాను పెంచిన మొక్కలకు ఎలాంటి చీడ, పీడలు కూడా కలగలేదని, కేవలం మొక్కలు పెరగడానికి మాత్రమే నీటిని పెట్టామన్నారు. శీతల ప్రాంతాల్లో లాగే మార్చి నెలలో పూతతో మొదలై ఆగస్టులో పంట పండ్లు కాయడం విశేషమని చెబుతున్నారు. 5 డిగ్రీలలోపు ఉష్ణోగ్రత్తలుండే ప్రాంతంలో పండించే ఆపిల్ పంట 45 డిగ్రీల నుంచి 50 డిగ్రీల వేడి ఉన్నా పంట సాగుకు ఉష్ణ ప్రాంతాలకు అనువైన వంగడాలను శాస్త్రవేత్త లు అభివృద్ధి చేయడంలో ఆసక్తి కనబరిచి ఎన్నో విషయాలను బయటకు తేవడం గమనార్హం. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా కనిపించని ఆపిల్ పంట భవిష్యత్తు తరాలకు ఎంతో అనుకూలంగా ఉంటుందనడంలో సందేహం లేదు. ఆపిల్ కాయలు విరగ్గాయడంతో ఇటీవల 300 ఆపిల్ పండ్లు తన కుటుంబ సభ్యులు, కూలీలకు పంచిపెట్టాడు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో ఆపిల్ ధర రూ.150 నుంచి 200 పలుకుతుండగా మన ప్రాంతాల్లో మాత్రం రైతులు ఆసక్తి చూపకపోవడం బాధాకరం. అయితే మన ప్రాంతంలో కూడా పంట సాగు చేయవచ్చని రైతు చెబుతున్నాడు.

ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలి

ప్రభుత్వం సబ్సిడీలతో సరిపెట్టుకోకుండా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించేలా రైతాంగానికి చేయూత నిచ్చి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశ వ్యాప్తంగా మన రాష్ట్రానికి వ్యవసాయ రంగంలో ఎంతో ముందుందని చెప్పడంలో సందేహం లేదు. ప్రభుత్వాలు మారినా రైతుల స్థితిగతులు మాత్రం మారడం లేదు. ముఖ్యంగా ఉచితాల పంపిణీ కంటే ముందుగా రైతుల అవసరాలను గుర్తించి మేలు చేసే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రైతుకు అనుసంధానం చేసే దిశగా చర్యలు తీసుకుంటే హర్షించదగ్గ విషయమే.

- శివశంకర్‌రెడ్డి, ఆదర్శ రైతు, అయ్యవారిపల్లె, వాల్మీకిపురం



శివశంకర్‌రెడ్డి సాగు చేసిన హరిమాన్ రకం యాపిల్ (ఫైల్‌ఫొటో)

జింకల గుంపు రాకతో అదుపుతప్పిన బైక్
దంపతులకు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న సుకన్య

ములకలచెరువు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జింకల గుంపు అడ్డురాడంతో బైక్ అదుపుతప్పి భార్యభర్తలు గంగులప్ప, సుకన్య తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే... మద్దినాయనిపల్లె పంచాయతీ నాయనివారిపల్లె వాసి గంగులప్ప భార్యతో కలిసి సొంత పనుల నిమిత్తం బైక్‌లో ములకల చెరువుకు వచ్చారు. పనిముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ములకల చెరువు వద్ద జింకల గుంపు అడ్డు వచ్చింది. దీంతో బైక్ అదుపు చేయలేకపోవడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అక్రమ రేషన్ పట్టివేత
విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు



తనిఖీ చేస్తున్న అడిషనల్ ఎస్పీ

సిద్దవటం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాధవరం-1 శివారు షెడ్‌లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్‌బియ్యం గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని చుట్టుపక్కల పొలాల్లో రైతులను విచారించగా జంగాలపల్లె వాసి రాజు అక్రమంగా బియ్యం నిల్వ చేసినట్లు గుర్తించామన్నారు. దాదాపు 300పైగా రేషన్ బియ్యం బస్తాలను ఒంటిమిట్ట సివిల్ సప్లై గోడౌన్‌కు తరలించి కేసు నమోదు చేశామని తెలియజేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారు సౌజన్య, వ్యవసాయాధికారి గంగాధర్, ఏఈఈ అశోక్‌కుమార్, వీఆర్వో శివశంకర్ పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు



మదనపల్లె అర్బన్, నవంబర్ 8:(ఆంధ్రజ్యోతి) కోర్టులో వెలసిన గంగమ్మకు శుక్రవారం ప్రత్యేక అలంకరణలో విశేషపూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకుడు సుష్మిత్ పుష్పాలతో అలంకరించి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. మహిళలు రాహుకాల సమయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మకు చీర, జాకెట్లు, పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. నిమ్మకాయలపై నెయ్యి వత్తులతో దీపారాధన చేశారు. కార్యక్రమాలను కమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, ట్రెజరర్లు రంగస్వామినాయుడు, కరుణాకర్ నాయుడు, మార్పూరి విక్కీ, మహేష్, దేవేంద్ర, శ్రీనివాసులునాయుడు పర్యవేక్షించారు.

'హైందవ శంఖారావం' కరపత్రాలు ఆవిష్కరణ

మదనపల్లె అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 2025న హైందవ శంఖారావం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్ తెలిపారు. సొసైటీ కాలనీలోని రామాలయంలో బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. సభను విజయవంతం చేయడానికి విశ్వహిందూ పరిషత్, హిందూచైతన్య వేదిక, సమరత సేవా ఫౌండేషన్ కార్యకర్తలు పాల్గొనాలన్నారు. వేణుగోపాల్‌నాయుడు, భానుప్రకాష్, దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్

12 ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం ● ఎనిమిది మంది పరార్ : ఫారెస్ట్ రేంజి అధికారి కళావతి



పట్టుబడిన నిందితుడితో ఫారెస్ట్ రేంజ్ సిబ్బంది

సిద్దవటం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం బీట్ భద్రికోన అటవీ ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లర్ వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకుని, 12 ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకున్నామని సిద్దవటం అటవీ క్షేత్ర అధికారి కళావతి తెలియజేశారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ అందిన సమాచారంపై కడప డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్ ఆదేశాలపై సిబ్బందితో గురువారం రాత్రి భద్రికోన అటవీ ప్రాంతంలో తనిఖీ చేశామన్నారు. కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణాకు దుంగలను లోడు చేస్తుండగా సిబ్బందిని చూసి పరారయ్యారన్నారు. వారిని వెంబడించి స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అక్కడ లభ్యమైన 12 ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. స్మగ్లర్‌ను విచారించగా నెల్లూరు జిల్లా కలువాయి మండలం తిరుమలపాడు వాసి వెంకటేశ్‌గా తెలిపాడన్నారు. బెంగుళూరు వాసి హయాజ్ కారు, 8 మంది కూలీలను అప్పజెప్పి ఎర్రచందనం దుంగలను తీసుకురావాలన్నాడని అంగీకరించాడు. పరారైన 8 మంది కూలీల కోసం అటవీ సిబ్బంది గాలిస్తున్నామన్నారు. దుంగల బరువు 274 కిలోలు ఉండగా రూ.76120 విలువైనవన్నారు. కేసు నమోదు చేసి వెంకటేశ్‌ను తిరుపతి కోర్టుకు హాజరు పరుస్తున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేశు, ఎఫ్‌బీఓ పెంచలరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, ఏబీఓ హైమావతి, బేస్ క్యాంప్ సిబ్బంది, స్టైకింగ్ ఫోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో నేటి నుంచి సవరణలు

కలికిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో సవరణల కోసం పోలింగ్ కేంద్రాలున్న పాఠశాలలను ఈనెల 9, 10, 23, 24 (శని, ఆదివారాలు) తెరిచి ఉంచాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ విద్యా శాఖకు ఆదేశాలు జారీ చేస్తూ చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. పోలింగ్ కేంద్రాలున్న పాఠశాలల్లో ఓటర్ల సవరణ దరఖాస్తులు స్వీకరించేందుకు అనువుగా పాఠశాలల గేట్లు తెరిచి ఉంచాలని తహసీల్దార్లు ఎంఈఓలను కోరారు. బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల ఆవరణల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటారన్నారు. జనవరి 1కి అర్హులు ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని తహసీల్దారు నవీన్ తెలిపారు.

కోడి పందెం స్థావరాలపై పోలీసుల దాడులు

మదనపల్లె అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చీకల బైలు గ్రామం బెంగళూరు రోడ్డులోని బార్లపల్లె వద్ద గుట్ట లో కోడిపందెం స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. కోడిపందెం ఆడుతున్న పదిమందిని అదుపులోకి తీసుకుని, రెండు కోళ్లు, 8 బైకులు, రూ. 35,260 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలి పారు.

చెన్నకేశవస్వామి ఆలయ భూములు స్వాధీనం



వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న ఈఓ, ఎస్ఐ

రామసముద్రం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కురిజల గ్రామం పురాతన చెన్నకేశవ స్వామి ఆలయం వివాదాస్పద భూములను స్వాధీనం చేసుకున్నట్లు దేవదాయ శాఖ ఈఓ రమణ తెలిపారు. సర్వే నెంబర్లు 52/14లో 1.60 సెంట్లు, 57/25లో 22 సెంట్లు, 52/10లో 18 సెంట్లు, 41/4లో 8 సెంట్లు, 52/3లో 7 సెంట్ల భూమిని స్వాధీనం చేసుకున్నామని, త్వరలో లీజువేలం నిర్వహించి వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు ఈఓ తెలిపారు. రెవెన్యూ అధికారులు, ఎస్ఐ వెంకటసుబ్బయ్య సమక్షంలో పంచనామా చేసినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, డిప్యూటీ తహసీల్దార్ నారాయణస్వామి, ఏఎస్ఐ హిమాచలపతి, రెవెన్యూ సిబ్బంది, మాజీ జడ్పీటీసీ మునివెంకటస్వామి, దొడ్డిపల్లె ఆనంద, మాజీ జడ్పీటీసీ శివశంకర్, రాజేష్, మాలమహానాడు అధ్యక్షుడు క్రిష్ణప్ప, చెంగారెడ్డి, నాగరాజ, భూలక్ష్మి, శంకర, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు
● శిక్షణ తరగతుల్లో అబ్జర్వర్ ప్రసాద్



శిబిరంలో మాట్లాడుతున్న అబ్జర్వర్ ప్రసాద్

మదనపల్లె టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి ఎంపీడీఓల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ప్రణాళికలు రూపొందించాలని అబ్జర్వర్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక సీఎల్ఆర్సీ భవనంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన 18 మండలాల ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు, ఇద్దరేసి పంచాయతీ కార్యదర్శులకు జీపీడీపీ శిక్షణ నిర్వహించారు. కార్యక్రమ అబ్జర్వర్ ప్రసాద్ మాట్లాడుతూ రెండు రోజులు నిర్వహించే ఈ తరగతుల్లో 2025-26 వార్షిక సంవత్సరంలో చేపట్టబోయే అభివృద్ధి పనులను గుర్తించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తేనే వచ్చే ఆర్థిక సంవత్సరం నిధులు మంజూరవుతాయన్నారు. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు నివేదికలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి డీఎల్‌పీఓ లక్ష్మీపతి, రిసోర్స్ పర్సన్ దిలీప్‌కుమార్, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

గుంటూరు వాసి అశోక్‌రెడ్డి మదనపల్లెలో అదృశ్యం



మదనపల్లె అర్బన్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): అప్పు వసూళ్ల కోసం మదనపల్లెకు వచ్చిన గుంటూరు వాసి అశోక్ రెడ్డి అదృశ్యమయ్యాడని టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. గుంటూరుకు చెందిన ఎర్రం అశోక్‌రెడ్డి మదనపల్లె మండలం, అవకిశెట్టిపల్లెకు చెందిన కిషోర్‌రెడ్డికి సుమారు రూ. 56 లక్షలు అప్పు ఇచ్చాడు. ఇచ్చిన అప్పు ను వసూళ్ల కోసం ఈ నెల 5వతేదీన భార్య శ్యామలతో కలిసి మదనపల్లెకు వచ్చినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఓ లాడ్జీలో భార్యను ఉంచి అప్పు వసూలుకు చిత్తూరు బస్టాండ్‌కు వెళ్లాడు. దీంతో 6వ తేదీ నుంచి కనపడకుండా పోయాడంటూ భార్య శ్యామల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అదృశ్యం కేసును నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



అక్కడ పోలీసు ఉన్నాడు... మద్యం దుకాణదారులు పాటించాల్సిన నిబంధనలు వివరిస్తున్నాడు. ఆ పక్కనే ఉన్న చిల్లర కొట్టు వద్ద ఓ వ్యక్తి తాపీగా మద్యం తాగుతున్నాడు. ఎక్కడైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిని పట్టుకుని కేసులు పెట్టి జరిమానా విధిస్తున్న పోలీసులు వారి ముందే షాపు వద్ద మద్యం తాగుతున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. ఇది శుక్రవారం ఉదయం 11.15 గంటలకు స్థానిక చౌడేశ్వరి కల్యాణ మండపం పక్కన రింగ్ రోడ్డులో ఉన్న యుగంధర్ వైన్స్ వద్ద జరిగింది.

- మదనపల్లె టౌన్,(ఆంధ్రజ్యోతి)

మీకు సగం... మాకు సగం

- ఆక్రమణలలో ఐక్యత చాటుతున్న ఇరుపార్టీల కబ్జాదారులు
- వాటాలు పంచుకునేందుకు ఎత్తుగడ
- మళ్లీ చేతివాటం ప్రదర్శిస్తున్న నకిలీ పట్టారాయుళ్లు
- బద్వేలులో భూ దందాలకు తెరపడేనా..



బద్వేలు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణలకు అడ్డా బద్వేలు నియోజకవర్గం. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రభుత్వ భూములు ఎక్కడ కనబడితే అక్కడ గద్దల్లా వాలిపోయి కబ్జాలకు పాల్పడేవారు. దీంతో బద్వేలు, గోపవరం మండలాలలో పెద్ద ఎత్తున భూములు వైసీపీ నేతల కబంధ హస్తాలలో చిక్కుకున్నాయి. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం కూలిపోయి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆపార్టీకి చెందిన కొందరు కబ్జారాయుళ్లు వైసీపీ అక్రమార్కుల కంటే తామేమీ తీసిపోమ్మన్నట్లు భూ ఆక్రమణలకు తెరలేపారు. అయితే ఇప్పటికే వైసీపీ వారు కనిపించిన ప్రభుత్వ భూములన్నింటిని తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. దీంతో చేసేది లేక కూటమి నాయకులు వైసీపీ ఆక్రమణదారులతో చేయి కలిపారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కబ్జా చేసిన భూములు, ఇతర స్థలాలకు మేం రక్షణ కల్పిస్తాం, అవసరమైన మేరకు అమ్మేసి ఇద్దరం కలిసి సొమ్ము చేసుకుందామంటూ పన్నాగం పన్నారు. దీంతో బద్వేలు, గోపవరం మండలాలలో కబ్జాల పర్వం మళ్లీ మొదటికి వచ్చింది. ఇరు పార్టీల కబ్జారాయుళ్లు కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాలపై కన్నేసి వచ్చే ఆదాయంలోమీకు సగం, మాకు సగం అన్నట్లు వాటాలు పంచుకునేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం.

వాటాలు పంచుకునేందుకు...

రోజురోజుకు విస్తరిస్తున్న బద్వేలు పట్టణం దాని పక్కనే ఉన్న గోపవరం మండల ప్రాంతాలలో భూములు, ఇళ్ల స్థలాలకు బాగా డిమాండ్ ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ ప్రభుత్వ, ప్రైవేటు భూములు, స్థలాలను అమ్మిసొమ్ము చేసుకున్న మొత్తంలో వాటాలు పంచుకునేం దుకు ఇరు పార్టీల నాయకులు ఎత్తుగడ వేశారు. ఇటీవల బద్వేలు పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో ఓ ప్లాటు విషయంలో ఇరుపార్టీల కబ్జాదారులు కలిసి అమ్మిన మొత్తంలో అక్కడ పరిస్థితిని, దాని విలువను బట్టి వాటాలు పంచుకున్నట్లు సమాచారం. గోపవరం మండలంలోని నెల్లూరు రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో ఇరు పార్టీల నేతలు కలిసి దాదాపు 40 ఎకరాల వరకు ఆక్రమించి వారి ఆధీనంలో ఉంచుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. బద్వేలు పరిసర ప్రాంతాలలో ఉన్న కోట్లాది రూపాయల ప్రభుత్వ స్థలాలను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా 116, 26 సర్వేనెంబర్లలో భారీ స్థాయిలో భూ ఆక్రమణలు జరిగినట్లు సమాచారం. సి.కొత్తపల్లెలో ఒకటి నుంచి 90 సర్వే నెంబర్లలో కూడా భారీ స్థాయిలో భూఆక్రమణలు చోటు చేసుకున్నాయి.

అవే పంచాయితీలు

బద్వేలులో రెవెన్యూ అధికారులు, పోలీసుల వద్ద భూ ఆక్రమణలు, వివాదాలకు సంబంధించిన పంచాయతీలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే ఇవన్నీ రికార్డు కావడం లేదు. ఏదోరకంగా వాటాలు కుదుర్చుకోవడంతో సర్దుబాటు అవుతున్నాయని చెప్పవచ్చు. మరికొన్ని వివాదాలు అలాగే కొనసాగుతున్నాయి. ప్రతిరోజూ ఇలాంటి నాలుగైదు పంచాయితీలు, వివాదాలు ఉంటున్నాయంటే బద్వేలులో ఇరు పార్టీలకు చెందిన కబ్జారాయుళ్లు చేస్తున్న దందాలు ఏ స్థాయిలో ఉన్నాయో ఊహించవచ్చు.

నకిలీ పట్టారాయుళ్లకు హెచ్చరికలు

బద్వేలు భూ వివాదాలకు ప్రధాన కారణమైన నకిలీ పట్టాల సృష్టికర్తలపై పోలీసులు దృష్టి పెట్టారు. నకిలీ పత్రాలు సృష్టించి పట్టుబడ్డవారిని గత ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పిలిపించి తీవ్ర హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో బద్వేలులో కబ్జాలు, ఆక్రమణల పర్వానికి కొంతకాలం బ్రేక్ వేసి.. స్తబ్దుగా ఉన్న వీరు మళ్లీ ఇటీవల ఇలాంటి కార్యకలాపాలకు దిగుతున్నట్లు సమాచారం. పోలీసులు ఇరు పార్టీలకు చెందిన ఆక్రమణదారులపై దృష్టి పెట్టకపోతే బద్వేలులో మళ్లీ ఆక్రమణల పర్వానికి అడ్డూ అదుపు లేకుండా పోతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్కూటర్‌ను ఢీకొన్న టిప్పర్ రిటైర్డ్ విద్యుత్ ఉద్యోగి మృతి




ప్రమాద స్థలంలో రామచంద్రారెడ్డి మృతదేహం, రామచంద్రారెడ్డి (ఫైల్)

ఎర్రగుంట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ విద్యుత్ లైన్‌మాన్ గుత్తి రామచంద్రారెడ్డి(72) మృతి చెందాడు. ఎర్రగుంట్ల నగరపంచాయతీ న్యూకాలనీలో నివాసం ఉంటున్న రామచంద్రారెడ్డి శుక్రవారం ఉదయం స్కూటీలో ప్రొద్దుటూరుకు వెళ్లేందుకు బయలు దేరాడు. నాలుగు రోడ్ల కూడలిలోని ఆర్‌ఓబి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. దీంతో టిప్పర్ కింద పడటంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. సీఐ నరేష్‌బాబు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. కాగా, ఏరువాక గంగమ్మ ఆలయ కమిటీ ట్రెజరర్‌గా ఉన్న రామచంద్రారెడ్డి మృతి పట్ల కమిటీ దిగ్ర్భాంతిని వ్యక్తం చేసింది. ఎర్రగుంట్ల మండల ఎన్డీయే ఇన్‌చార్జి మధు సూదన్‌రెడ్డి సంతాపం తెలిపారు.

70 రేషన్ బియ్యం బస్తాలు స్వాధీనం



ప్రొద్దుటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని వాసవీ ట్రాన్స్ పోర్టు పక్కన ఓ గదిలో 70 రేషన్ బియ్యం బస్తాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. శుక్ర వారం తహసీల్దారు గంగయ్య డీటీ సాయినాథరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మల్లికార్జునలు రేషన్ బియ్యం అక్రమంగా నిల్వలు ఉన్నట్లు గుర్తించిన గది షెట్టర్ తాళాలు పగలగొట్టి.. అందులో వున్న రేషన్ బియ్యం బస్తా లను స్వాధీనం చేసుకున్నారు. 70, 50 కేజీల బస్తాలు మొత్తం 3500 కేజీలు ఉంటాయని అంచనా వేశారు. బియ్యంతో పాటు 15 కేజీల కంది బేడలు, 7కేజీల చెక్కర కూడా వున్నట్లు తెలిపారు. ఈ గదిలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వలు ఎవ్వరు పెట్టారనేది అధికారులు తేల్చ లేకపోయారు. దీంతో కేసు నమోదు చేయకుండానే వీటిని స్వాధీనం చేసుకున్నారు. బొల్లవరంలో ఒక అద్దె గదిలో 14 రేషన్ బియ్యం బస్తాలను సురేంద్ర అనే వ్యక్తి అక్ర మంగా నిల్వ చేయడం గుర్తించి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు.

ఎస్సీ బాలికల వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం




ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చంద్ర హరిత, నందిని

జమ్మలమడుగు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ ప్రభుత్వ బాలికల వసతి గృహంలో గురువారం రాత్రి ఇద్దరు విద్యార్థినులు విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. హాస్టల్ గేటు వద్ద అపస్మారకస్థితిలో పడిపోయిన వీరిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివరాలిలా.. ఎస్సీ ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఉంటున్న ఆర్.చంద్రహరిత, సి.నందిని జమ్మలమడుగు పట్టణంలోని కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం, మొదటి సంవత్సరం చదువుతున్నారు. వీరిద్దరు స్నేహితులు. కాగా... గురువారం రాత్రి 9.30గంటల సమయంలో హాస్టల్ నుంచి బయటికి వెళ్లారు. తిరిగి హాస్టల్‌కు వస్తుండగా ఏం జరిగిందో ఏమో కానీ ఉన్నట్లుండి హాస్టల్ గేటు వద్ద పడిపోయారు. వెంటనే హాస్టల్ వార్డెన్ అక్కడున్న వర్కర్ విషద్రావణం తాగినట్లు గుర్తించి.. 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సమాచారం విద్యార్థినుల తల్లిదండ్రులకు తెలపడంతో వారు అక్కడకు చేరుకున్నారు. వీరిలో ఆర్.చంద్రహరితను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి, సి.నందినిని కడప రిమ్స్‌కు తరలించారు. ఈ విషయం తెలిసిన అర్బన్ పోలీసులు, రెవెన్యూ అధికారులు, స్థానిక సచివాలయ సిబ్బంది వసతి గృహం వద్దకు చేరుకొని జరిగిన ఘటనపై విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. హాస్టల్ వార్డెన్‌ను వివరణ కోరగా ఆమె దాటవేశారు.

కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత లింగమూర్తి మృతి



కడప సెవె న్‌రోడ్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు, రాయలసీమ రైతు సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ లింగమూర్తి (84) శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. ఉమ్మడి జిల్లాలోనే కాక రాయలసీమ ప్రాంతంలో గుర్తింపు ఉన్న నేత లింగమూర్తి అని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. రాయలసీమ వ్యాప్తంగా తాగు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై అనేక దఫాలుగా పోరాటాలు చేస్తూ రైతాంగాన్ని మేల్కొలిపిన నేత లింగమూర్తి అన్నారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కమిటీ సభ్యుడిగా, రాయలసీమ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఆయన పనిచేశారని తెలిపారు.

గురుకుల పాఠశాలలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తనిఖీ



ప్రొద్దుటూరు ఆసుపత్రిలో విద్యార్థిని వర్షిణిని పరామర్శిస్తున్న రాష్ట్ర జాయింట్ సెక్రటరీ

కొండాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొండాపురం గురుకుల పాఠశాలను శక్రవారం సాయింత్రం గురుకుల పాఠశాలల రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మురళీకృష్ణ తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలలోని ఇద్దరు విద్యార్థినులు పాము కాటుకు గురైన నేపథ్యంలో తాడేపల్లె నుంచి వచ్చిన ఆయన పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలని ఆదేశించారు. వారంలోపు పూర్తిగా శుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. అదేవిధంగా భోజనశాల, బాత్ రూంలు కూడా శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రస్తుతం ప్రొద్దుటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని వర్షిణి దగ్గరకు వెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందేలా చూడాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. కాగా ప్రస్తుతం ఇద్దరు విద్యార్థులు కోలుకుంటున్నట్లు ప్రిన్సిపల్ క్రిష్ణవేణి వివరించారు.

హయ్యర్ పెన్షన్ చెల్లింపు ప్రక్రియలో అనిశ్చితి సరిచేయండి

- విశ్రాంత ఉద్యోగుల సంఘం కడప రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు



పీఎఫ్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

కడప మారుతీనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశ్రాం త ఉద్యోగులకు సజావుగా సాగుతున్న హయ్యర్ పెన్షన్ చెల్లింపు విధానంలో నెలకొన్న తీవ్ర గందరగోళ అనిశ్చితిని త్వరితగతిన సరిచేయాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం కడప రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారెడ్డి, వై.రవీంద్రనాథ్‌వర్మ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా హయ్యర్ పెన్షన్ చెల్లింపు విధానాన్ని నిలుపుదల చేయడం విడ్డూరంగా వుందన్నారు. ఇందుకు నిరసనగా రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు కడప రీజియన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పీఎఫ్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 2022 నవంబర్ 4న వెలువడిన సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 2014 తర్వాత పదవీ విరమణ పొందిన వారికి హయ్యర్ పెన్షన్ కొర కు దరఖాస్తు చేసుకునేందుకు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ఆ మేరకు చాలా మంది పదవీ విరమణ పొందిన ఉద్యోగులు వారి స్థాయిని బట్టి, వారికి వచ్చిన డిమాండ్ నోటీసుల ప్రకారంగా వారి వద్ద డబ్బులు లేకున్నా ఎక్కువ పెన్షన్ వస్తుందనే ఆశతో అప్పులు తెచ్చి ఒకటిన్నర లక్షల రూపాయల నుంచి సుమారు 11 లక్షల రూపాయల వరకు డీడీలు తీసి పంపించారన్నారు. గత ఏప్రిల్ నెలలో డబ్బులు కట్టిన వారికి కూడా ఇంతవరకు హయ్యర్ పెన్షన్ రాలేదన్నారు. ఈ విషయంగా సంబంధిత పీఎఫ్ కార్యాలయ ఉద్యోగులను విచారించగా వారు కూడా తమకేమీ తెలియదని సమాధానం చెప్పారన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు హయ్యర్ పెన్షన్ ప్రక్రియను నిలుపుదల చేయాలని సూచించినట్లు వెల్లడించారు. దీంతో విశ్రాంత ఉద్యోగులు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పాలక ప్రభుత్వాలు సమస్యను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం కోశాధికారి పి.సోమశేఖర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రాజారెడ్డి, శ్రీనివాసులతో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మాన్‌పై 'విజిలెన్స్' రహస్య విచారణ



విచారణ అనంతరం విషయాలు ల్యాప్‌టాప్‌లో రికార్డు చేస్తున్న అధికారులు

దువ్వూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని విద్యుత్తు శాఖలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన బి.నాయబ్‌రసూల్‌పై ఆశాఖ విజిలెన్స్ అధికారులు శుక్రవారం రహస్య విచారణ చేపట్టారు. బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి లైన్‌మాన్ దురాగతాలను అడిగి తెలుసుకున్నారు. అక్టోబరు 23వ తేదీన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో సదరు ఉద్యోగి చేస్తున్న అవినీతి అక్రమాలపై 'ఏతే నాకేంటి' శీర్షికన కథనం ప్రచురణ అయిన విషయం విధితమే. ఇందుకుస్పందించిన విద్యుత్తు శాఖ వెంటనే నాయబ్‌రసూల్‌ను మైదుకూరుకు బదిలీచేసింది. శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఎటువంటి సమాచారం రైతులకు ఇవ్వకుండా వచ్చి రహస్యంగా విచారణ గావించారు. కొంత మంది బాధిత రైతులకు విషయం తెలిసి విచారణ అధికారుల వద్ద తమను ఏ విధంగా సదరు ఉద్యోగి పీడించి లంచాలు తీసుకున్నాడో వాగ్మూలం ఇచ్చారు. రైతులు చెప్పిన విషయాలను విచారణ అధికారులు రికార్డు చేసుకున్నారు. ప్రముఖ దినపత్రికలో విలేకరిగా పనిచేసిన వ్యక్తి మృతి అనంతరం అతని భార్య పొలానికి రెండు కరెంటు స్తంభాలు, వైరు అవసరం పడగా రూ.10 వేలు లంచం ఇచ్చేంతవరకు నాయబ్‌రసూల్ విద్యుత్తు సమస్య పరిష్కరించలేదని బాధిత మహిళా రైతు బంధువు విచారణ అధికారుల ఎదుట వాపోయారు. సామాన్య రైతులను ఇతను తొమ్మిదేళ్లుగా లంచాల రూపంలో పీల్చుకు తిన్నాడని వాపోయారు. బహిరంగ విచారణ చేస్తే పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొంటారని చెప్పారు. దీనికి విచారణ అధికారులు నిరాకరించారు. విచారణలో విజిలెన్స్ సీఐ, ఎస్ఐ, మరో ఇద్దరు అధికారులు పాల్గొన్నారు. ఈ విషయమై సదరు అధికారులను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా విషయాలు వెల్లడించడానికి వారు నిరాకరించారు.

ఫసల్‌బీమాపై రైతులకు అవగాహన కల్పించండి



రైతుసేవా సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు

పులివెందుల టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై రైతుసేవా కేంద్రం సహాయకులు రైతులకు అవగాహన కల్పించి.. సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని జిల్లా వ్యవసాయశాక అధికారి నాగేశ్వర్‌రావు సూచిం చారు. పులివెందుల పట్టణంలోని మార్కెట్‌యార్డు ప్రాంగణంలో పులివెందుల వ్యవసాయ డివిజను పరిధిలోని రైతుసేవా కేంద్రం సహాయకులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత రబీ పంటలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 8 పంటలను ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం అమలుకు గుర్తించామన్నారు. ఇందులో ప్రధానంగా వేరుశనగ, శెనగ, నువ్వులు, పెసలు, జొన్న, ప్రొద్దుతిరుగుడు పంటలకు డిసెంబరు 15లోపు బీమా చేయించుకోవాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టరు రమణారెడ్డి, పులివెందుల వ్యవసాయ సబ్ డివిజ ను వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉంటూ రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందజేయాలన్నారు. కాగా గత సీజన్‌లో బాగా పనిచేసిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు రమేశ్, నాగలక్ష్మి, చెన్నరెడ్డి, నవంత్‌బాబు, రాజేంద్రప్రసాద్, సునీల్ పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్ నవంబర్ 8. (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ మెన్ అండర్-14 రెండు రోజుల ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా వివిధ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లు శుక్రవారం డ్రాగా ముగిశాయి. వివరాలిలా...

కేఓఆర్‌ఎం మైదానంలో క్రిష్ణా-విజయనగరం జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్‌కు దిగిన క్రిష్ణా జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 286 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన విజయనగరం జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 85.2 ఓవర్లలో 280 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో శ్రీకాకుళం- నెల్లూరు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేపట్టిన శ్రీకాకుళం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 8 వికెట్లకు 447 పరుగులు చేసింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 265 పరుగులు చేసింది. ఇందులో సాయియశ్వంత్ 100 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం-గుంటూరు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 89.3 ఓవర్లలో 276 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 65.4 ఓవర్లలో 179 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. కాగా బౌలింగ్ విభాగంలో సుహాస్ 5 వికెట్లు పడగొట్టాడు. రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన గుంటూరు జట్టు ఆట ముగిసే సమయానికి 30 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 146 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

నేటి నుంచి 68వ రాష్ట్రస్థాయి రగ్బీ స్కూలు గేమ్స్

కమలాపురంరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కమలాపురం పట్టణంలో డిగ్రీకళాశాలలో శనివారంనుంచి 68వ రగ్బీ రాష్ట్ర స్థాయి స్కూలు గేమ్స్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలకు రాష్ట్రంలోని అన్ని పాఠశాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థుల వసతులను మెరుగుపరచాలి - జడ్పీసీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్పీసీఈవో ఓబుళమ్మ

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యను అభ్యసించే విద్యార్థుల అన్ని అవసరాలను, వసతులను గుర్తించి వాటిని మెరుగుపరచాలని జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సి.ఓబుళమ్మ పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆమె ఎంపీడీవో కార్యాలయంతో పాటు అదే ఆవరణలో ఉన్న భవిత పాఠశాల (ప్రత్యేక అవసరాలగల పిల్లల వనరుల కేంద్రం), ఎలిమెంటరీ స్కూళ్లను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి పరిసరాలను పరిశీలించారు. భవిత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల వసతులను మెరుగుపరచాలని, అక్కడి టీచర్లకు సూచించారు. పాఠశాలకు చెందిన మరుగుదొడ్డి సక్రమంగా లేదని, కొత్తగా నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తేవాలని ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డిని ఆదేశించారు. ఎలిమెంటరీ పాఠశాల పరిసరాలు, వంటశాల తదితర వాటిని పరిశీలించారు. అక్కడి వంటశాల అసంపూర్తిగా ఉండడంతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. తదనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమయపాలన పాటించి.. విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.

టీడీపీ ప్రభుత్వంలోనూ వైసీపీ నేతలకే ప్రాధాన్యం

● జడ్పీ చైర్మన్ చాంబర్ ఎదుట నేటికీ తొలగని ఎమ్మెల్యే ఫొటో కటౌట్


జడ్పీ చైర్మన్ చాంబర్ ఎదుట వైసీపీ ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఫొటో కటౌట్

కడప రూరల్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వంలోనూ అధికారులు వైసీపీ నేతలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో గత సీఈఓ ఎం.సుధాకర్‌రెడ్డి వైసీపీ నేతలు చిటిక వేస్తే చాలు అన్నట్లు ఆయన అన్నీతానై అడిగిన పనులన్నీ చేసిపెట్టేవారుగా పేరుగడించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సుధాకర్‌రెడ్డిని సీఈఓ పోస్టు నుంచి తప్పించి ఈయన స్థానంలోకి సి.ఓబులమ్మను తీసుకొచ్చారు. అయితే బదిలీల్లో భాగంగా ఆయన వెళ్లేటప్పుడు వైసీపీ నేతలకు సానుకూలంగా ప్రతి సెక్షనుకు ఓ వైసీపీ విధేయ అధికారిని ఏర్పాటుచేసి వెళ్లారు. ఈయన తరువాత సీఈఓగా వచ్చిన ఓబులమ్మ పరిపాలనలో టీడీపీ ప్రభుత్వానికి తగ్గట్టుగా మార్పు ఉంటుందని భావించారు. అయితే టీడీపీ కూటమి అధికారంలో ఉన్నప్పటికీ జడ్పీలో మాత్రం వైసీపీ నేతలకు, వారికి భజన చేసే అధికారులకే ప్రాధాన్యం లభిస్తోందనే విమర్శలున్నాయి. ఇటీవల వైసీపీ జడ్పీటీసీలు ప్రొపోజల్ పెట్టిన పనుల నిర్ధారణ విషయంలో కూడా వారితోనే చర్చించినట్లు సమాచారం. అలాగే జడ్పీలోని చైర్‌పర్సన్ చాంబర్ ఎదుట రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఫొటోతో ఏర్పాటు చేసిన కటౌట్ అలాగే ఉంది. కూటమి అధికారంలోకి వచ్చి ఇంతకాలం అయినా ఆ కటౌట్‌ను తొలగించకుండా అలానే ఉంచారనే విమర్శలున్నాయి.

ఎమ్మెల్యే ఫొటో కటౌట్ తొలగింపునకు చర్యలు



జడ్పీ చైర్మన్ చాంబర్ ఎదుట ఉన్న వైసీపీ ఎమ్మెల్యే ఫొటో కటౌట్ తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. ఒకటి రెండు సార్లు చైర్మన్ చాంబర్‌కు వెళ్లాను. ఫొటో ఉన్న విషయం గమనించలేదు. అధికారులు కూడా నా దృష్టికి తీసుకురాలేదు. - ఓబులమ్మ, జడ్పీ సీఈఓ

'వైసీపీ పాలనలో సోషల్ మీడియా కార్యకర్తలపై అనేక దాడులు'

కమలాపురంరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో సోషల్ మీడియా కార్యకర్తలపై అనేక దాడులు జరిగాయని, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వాటిని మరిచి మాట్లాడుతుంటే ఏమనాలో అర్థం కావడంలేదని ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ సోషల్ మీడియా ఫ్యాక్టరీకి అడ్డూఅదుపు లేకుండా పోయింద న్నారు. కనీసం మహిళలని కూడా చూడకుండా సోషల్ మీడియా వేదికగా అవమానించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. మాజీ ఉప మండల అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మల్లేశ్వరుడు, పాచికలపాడు శేషారెడ్డి, కంచెన్నగారి పల్లె జగన్‌మోహన్‌రెడ్డి, గంగవరం రామిరెడ్డి, నల్లింగాయపల్లె రమణారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి స్కూలు గేమ్స్

కమలాపురంరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రబ్బీ రాష్ట్ర స్థాయి స్కూలు గేమ్స్‌ను శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శివశంకర్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, అరుణకుమారి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ కమలాపురం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీలకు రాష్ట్రంలోని అన్ని పాఠశాల నుంచి క్రీడాకారులు హాజరవుతారన్నారు.



కేసీ పంట కాల్వ ఇలా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ప్రస్తుత పంటసాగు కాలంలో నీరు వెళ్లే దారిలేక ఇబ్బంది ఏర్పడుతోందని రైతులు పేర్కొంటున్నారు. దీంతోపాటు మండల వ్యాప్తంగా ఉన్న కాల్వలన్నీ శుభ్రం చేసి పొలాలకు నీరందించాలని అన్నదాతలు విన్నవిస్తున్నారు. - చెన్నూరు,(ఆంధ్రజ్యోతి)

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కడప నాగరాజుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం కలుగుతుందని అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.కావున వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

మహిళలకు అవకాశం కల్పిస్తే దేశానికి కీర్తి

● వైవీయూ వైస్‌చాన్సలర్ క్రిష్టారెడ్డి


మాట్లాడుతున్న ప్రొఫెసరు క్రిష్టారెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వివక్ష చూపకుండా వారికి సమాన అవకాశాలు కల్పిస్తే దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకువస్తారని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్టారెడ్డి అన్నారు. శుక్రవారం వైవీయూ హ్యూమనిటీ భవన్‌లో మహిళలకు సామాజిక అవగాహన అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ప్రొఫెసరు ఎంఎం వినోదిని అధ్యక్షత వహించగా వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ లింగ వివక్షత నిర్మూలించే దిశగా వైవీయూ విద్యార్థులు ప్రయత్నం చేయాలని ఆకాంక్షించారు.

ప్రపంచంలోని ఈశాన్యదేశాల్లో మహిళలకు చాలా గౌరవం ఉందన్నారు. మహిళలు సమాజానికి శక్తి అని వారు సంతోషంగా ఉన్నప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. విశిష్ట అతిథి తెలంగాణా హైకోర్టు న్యాయవాది, హక్కుల కార్యకర్త వసుధ నాగరాజు 'మహిళా ఉద్యమాలు-చట్టాలు' అనే అంశంపై మాట్లాడుతూ 1972లో మహారాష్ట్రలో మొదలైన అత్యాచార సంఘటన నుంచి 2019లో వచ్చిన దిశ సంఘటన వరకు మహిళా ఉద్యమాలు జరిగాయన్నారు. విద్యార్థినులు, యువత, మహిళలు మౌన నిశ్శబ్దం వీడానలి ఆకాంక్షించారు. అత్యంత పేదవర్గాలు న్యాయస్థానం తలుపులు తట్టినప్పుడు వచ్చే పనే నేటి మహిళా చట్టాలని పేర్కొన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి మాట్లాడారు. ఈ కర్యాక్రమంలో డాక్టర్ సీవీ వర ప్రభాకర్, ఎం.మమతకుమారి, డాక్టర్ గణేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'భూకబ్జాదారులపై చర్యలు తీసుకోండి'


తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దళితుడి భూమిని ఆక్రమించేందుకు కుట్రలు పన్ని దౌర్జన్యపూరితంగా వ్యవహరిస్తున్న వారిపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఇల్లూరి సురేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బాధితుడు, ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి తహసీల్దారుకు శుక్రవారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగర పరిధిలోని రామరాజుపల్లె పొలంలో దళితుడైన శేఖర్‌బాబుకు పూర్వీకుల నుంచి 70 సెంట్ల స్థలం సంక్రమించిందన్నారు. ఈ విషయమై గతంలో రెవెన్యూ అధికారులు సైతం ధ్రువీకరించారన్నారు. ఆ స్థలంపై కన్నేసిన ఆక్రమణదారులు స్థలాన్ని కబ్జా చేసి బాధితుడిని అక్కడి నుంచి తరిమి వేసేందుకు ప్రణాళికలు రూపొందిం చారన్నారు. అన్నిసాక్ష్యాలతో తహసీల్దారుకు సంబంధిత పత్రాలను సమర్పించామన్నారు. ఈ సంఘటనలో దౌర్జన్యకారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

11న కడపలో జాబ్‌మేళా

కడప మారుతీనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11 ఉదయం 10 గంటలకు ఐటీఐ సర్కిల్ వద్దగల ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా జరగనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఏ.సురేష్‌కుమార్ తెలిపారు. ఇందులో అమర రాజా గ్రూప్, నవభారత్ ఫర్టిలైజర్స్ కీర్తన ఫైన్‌సర్వ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నారన్నారు. ఆయా కంపెనీలలో మెషీన్ ఆపరేటర్, మార్కెటింగ్ మేనేజర్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్, లోన్ ఆఫీసర్స్ తదితర ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్‌మీడియట్, ఎనీ డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ అర్హత గలవారు అర్హులన్నారు. ఇందుకు 18 నుంచి 30 సంవత్సరాల లోపు గల వారు హాజరు కావాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.11,875 నుంచి రూ.33,000 వరకు హోదాను బట్టి వేతనం ఉంటుంన్నారు.

సీఐ మహ్మద్ ఆలీ బదిలీ

కడప (క్రైం), నవంబరు8 (ఆంధ్రజ్యోతి): కడప వీఆర్‌లో పనిచేస్తున్న మహ్మద్ ఆలీని అన్నమయ్య జిల్లా మన్నూరుకు బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు రేంజ్ పరిధిలో 20 మందిని బదిలీ చేశారు. ఇందులో భాగంగా కడప జిల్లా నుంచి ఒక్కరే బదిలీ అయ్యారు.

అభిమానిని పరామర్శించిన పుత్తా నరసింహారెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి వెళుతున్న కమలాపురం మండలం ఎర్రపల్లె కొత్తపల్లెకు చెందిన సుధారాయుడుని టీడీపీ రాష్ట్ర నాయకులు పుత్తా నరసింహారెడ్డి పరామర్శించారు. ప్రాణాపాయంలో ఉన్న సుధారాయుడు తాను చివరి సారి అయినా పుత్తా నరసింహారెడ్డిని చూడాలని కర్నూలు ఆసుపత్రికి వెళ్లే ముందు కడప బిల్టప్ సమీపంలో ఉన్న టీడీపీ కార్యాలయానికి చేరుకుని పుత్తాను కలిశారు. పుత్తా నరసింహారెడ్డి సుధారాయుడిని చూసి ఆరోగ్యంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

సంక్షిప్తం

శరవేగంగా టీడీపీ సభ్యత్వ నమోదు

వల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వల్లూరు మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు వేగంగా కొనసాగుతోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం తప్పెట్ల గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం వల్ల ఆయా కుటుంబాలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నాగేశ్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

కడప(క్రైం), నవంబరు8 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చిన్నచౌకు పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ విషద్రావణం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సమస్యలతో ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యులు ఆయన్ను నగరంలోని ఓ ప్రవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

డ్రైనేజీ పనులు పూర్తిచేయాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అలంఖాన్‌పల్లె దండు శ్మశానం సమీపంలో ఉన్న కాల్వ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం శ్మశాన వాటిక సమీపంలో ఉన్న కాల్వ పెండింగు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధులు ఉన్నాయని, పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డీఎస్సీ శిక్షణ స్క్రీనింగ్ పరీక్ష వాయిదా

కడప, వినాయకనగర్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా నిరుపేద ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలతో డీఎస్సీ శిక్షణ కోసం నిర్వహించే స్కీనింగ్ పరీక్ష వాయిదా పడినట్లు సంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 10న జరగాల్సిన పరీక్ష వాయిదా వేసినట్లు తెలిపారు. తదుపరి పరీక్ష తేదీని తెలుపుతామన్నారు.

హియరింగ్ మిషన్ల పంపిణీ

సీకేదిన్నె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలుగల ఆశా నిలయం పిల్లలకు హియరింగ్ మిషన్లు పంపిణీ చేసినట్లు ఆడియాలజిస్టు స్పీచ్ థెరపిస్ట్ శ్రీలేఖ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం ప్రకాశం పల్లెలోని ఆశా నిలయంలో శుక్రవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆడియో మెట్రేషన్ టెస్టులు నిర్వహించి మిషన్లు పంపిణీ చేశారు.

గోట్లూరు వీఆర్వో మృతి

వల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గోట్లూరు వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న రామ్మోహన్ గురువారం మృతిచెందారు. విధుల్లో ఉండగా అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో స్థానిక సిబ్బంది కడపకు తరలించారు. చికిత్స చేస్తుండగా బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడని తెలిపారు. తహసీల్దారు శ్రీవాణి తమ కార్యాలయంలో ఆయన మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం తహసీల్దారు, సిబ్బంది, నాయకులు నివాళులర్పించారు. వీఆర్వోకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన పంటలు : డీపీఎం

● ఇ.కొత్తపల్లెలో పర్యటించిన జర్మనీ బృందం


అరటి పంటను పరిశీలించిన అనంతరం వివరాలు తెలుసుకుంటున్న జర్మనీ బృందం

పులివెందుల రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా నాణ్యమైన పంటలు పండించవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇ.కొత్తపల్లెలో జర్మనీకి చెందిన రెహమాన్, సెల్వి నబూరస్ తదితరులు పర్యటించారు. పులివెందుల అరటి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు శివరామకృష్ణ, సునీల్, రేష్మలతో కలిసి వారు అరటి పంటను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం, రసాయన వ్యవసాయం మధ్య వ్యత్యాసాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి గట్టిపడుతోందని, దిగుబడిలో పోటీతత్వం ఎక్కువైపోయి రసాయన వ్యవసాయం చేస్తున్నామని పలువురు రైతులు తమ అభిప్రాయాన్ని వెల్లడించినట్లు డీపీఎం తెలిపారు. మీకున్న భూమిలో కొంత భాగంలో ప్రకృతి వ్యవసాయం చేయాలని డీపీఎం రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, సుభానిబి, సీసీ రామచంద్ర, ప్రవీణ, రవీంద్రరెడ్డి, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శివారెడ్డి, సందీప్, సొహెల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై దృష్టి పెట్టండి


గండ్లూరు కాలనీలోని మురుగు కాల్వను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు

కమలాపురంరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది ప్రజారోగ్యంపై దృష్టి పెట్టాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. శుక్రవారం కమలాపురం పంచాయతీ పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా గండ్లూరు కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే పాటించాలన్నారు. డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలుతున్నాయని, అం దుకు కారణం పారిశుధ్యం లోపించడమేనన్నారు. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. ఎంపీహెచ్‌ఈఓ వెంకటరెడ్డి, యూపీహెచ్‌సీ డాక్టరు నందకుమార్, సబ్‌యూనిట్ ఆఫీసరు లక్ష్మయ్య, హెల్త్ సూపర్‌వైజరు కొండారెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూలు అమలు చేయాలి'


డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఎస్టీయూ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూలు విడుదల చేసి న పదోన్నతులు చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంఘమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓ మీనాక్షికి వినతిపత్రం అందిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ తరగతులు రెసిడెన్షియల్ విధానంలో కాకుండా నాన్ రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై డీఈఓ స్పందిస్తూ త్వరలో చర్యలు తీసుకుంటామని వారికి తెలిపారు.

ఆగిపోయిన పనులను త్వరగా పూర్తి చేయండి: తులసిరెడ్డి

వేంపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఆగిపోయిన రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి కోరారు. శుక్రవారం పులివెందులలోని ఆర్‌అండ్‌బీ ఈఈ మాధవితో పాటు ఇతర అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బిల్లులు వచ్చాయని, అయినా పనులు ప్రారంభించని కారణంగా వేంపల్లెలో ప్రజలు భూలోకంలో యమలోకం చూస్తున్నారన్నారు. రోడ్ల విస్తరణ, డ్రైనేజీ పనులు అర్థాంతరంగా నిలిచిపోయిన కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దుమ్మూధూళి వల్ల శ్వాసకోశ వ్యాధులు, చర్మ వ్యాధులతో జనం సతమతమవుతున్నారన్నారు. తినుండారాలు, ఆహార పదార్థాలు పూర్తిగా దుమ్మూధూళితో కలుషితమవుతున్నాయన్నారు. దీంతో పాదచారులు, వాహనచోదకులు అనేక ఇబ్బందులుపడుతున్నారన్నారు. కడప-వేంపల్లె-పులివెందుల రోడ్డులో వేంపల్లె పంచాయతీ పరిధిలో 3.8కిలోమీటర్ల పొడవున రూ.47.08కోట్లతో 2023లో రోడ్ల విస్తరణ, డ్రైనేజీ పనులు మంజూరయ్యాయన్నారు. రూ.8.49కోట్ల పనులు జరిగాయన్నారు. వీటికి బిల్లులు రాని కారణంగా సంబంధిత కాంట్రాక్టర్ పనులు నిలుపుదల చేశారన్నారు. ఇటీవలనే బిల్లులు కూడా వచ్చాయన్నారు. అయినప్పటికి ఆగిపోయిన పనులు పునఃప్రారంభం కాలేదన్నారు. అదేవిధంగా వేంపల్లె-రాయచోటి మార్గంలో రూ.1.35కోట్లతో పనులు మంజూరయ్యాయని, రూ.27లక్షల మేర పనులు జరిగాయన్నారు. బిల్లులు రాని కారణంగా కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారన్నారు. కావున ఈ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని తులసిరెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ప్రతి ఒక్కరూ చెట్ల పెంపకం చేపట్టాలి


సచివాలయం వద్ద మొక్కలు నాటుతున్న ఏఓ ఈశ్వర్‌రెడ్డి తదితరులు

సీకేదిన్నె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చెట్ల పెంపకాన్ని చేపట్టాలని వ్యవసాయాధికారి ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం పాపాసాహెబ్‌పేట సచివాలయం వద్ద రైతు భరోసా కేంద్రం వద్ద ఆయుష్మాన్‌భారత్ హెల్త్ సెంటర్ వద్ద మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రజలంతా ఓ ఉద్యమంలా చేపట్టి పర్యావరణ పరిరక్షణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వీపీఏ గిరి, సురేష్, హిమబిందు, అగ్రికల్చరల్ స్టూడెంట్స్, ఏకలవ్య ఫౌండేషన్ విద్యావాహిని కోఆర్డినేటర్ సుదర్శన్ పాల్గొన్నారు.

అవమానిస్తూ మాట్లాడడం సరికాదు

● ఐదు నెలలైనా నిధులు వచ్చాయా? ● వైసీపీ మహిళా కార్పొరేటర్లు


సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ మహిళా కార్పొరేటరు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి):మేయరు సురేశ్‌బాబు, కార్పొరేటర్లను కడప ఎమ్మెల్యే మాధవి అవమానిస్తూ మాట్లాడడం సరికాదని వైసీపీ మహిళా కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు అయినా నగరాభివృద్ధికి ఎన్ని నిధులు తెప్పించారో ఎమ్మెల్యే తెలపాలన్నారు. శుక్రవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ నగర ప్రథమ పౌరుడైన మేయరు, వైసీపీ కార్పొరేటర్లను అవమానిస్తూ మాట్లాడడం సబబుకాదన్నారు. కనీసం కార్పొరేటరు అని కూడా విలువ ఇవ్వకుండా టీడీపీ కార్పొరేటరును అవమానించారని, అది ఎమ్మెల్యేకు తగదన్నారు. కార్పొరేటర్లుగా మాకు రక్షణ లేదు కాబట్టే ఎస్పీని ఆశ్రయించామన్నారు. మహిళలకు రక్షణ ఇవ్వడంలో పోలీసులు పూర్తిగా విఫలం చెందారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్పొరేటర్లు శ్రీలేఖ, శ్రీలత, మల్లేశ్వరి, మాధవి, కో ఆప్షన్ సభ్యులు పత్తిరాజేశ్వరి, మహిళా నాయకులు వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల జీవాలు చోరీ

● అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు విజ్ఞప్తి

జమ్మలమడుగు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని జమ్మలమడుగు మండలం పొన్నతోట గ్రామంలో గురువారం రాత్రి తొమ్మిది పొట్టేళ్లు (జీవాలు) చోరీకి గురయ్యాయి. అలాగే గత 24వ తేదీన మైలవరం మండలం రామచంద్రాయపల్లెలో ఎనిమిది జీవాలు, నవంబరు 4వ తేదీ లింగాపురం గ్రామంలో పది జీవాలు, నవంబరు 5వ తేదీ 5 జీవాలు చోరీకి గురయ్యాయని బాధితులు వాపోయారు. జమ్మలమడుగు పట్టణంలో ఆయా పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి దృష్టికి జీవాల చోరీ విషయం తెలిపారు. వరుస చోరీలతో జీవాల యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడైనా చోరీకి గురైన పొట్టేళ్లను విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

'విద్యుత్తు చార్జీల భారం మోపడం తగదు'

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై విద్యుత్తు చార్జీల భారం మోపడం తగదని సీపీఎం నాయకులు శుక్రవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఎనిమిదిసార్లు విద్యుత్తు చార్జీలు పెంచిన పాపానికి ప్రజలు ఆ పార్టీని 11 సీట్లకే పరిమితం చేశారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అయిదు నెలలకే ప్రజలపై విద్యుత్తు ఛార్జీల భారం మోపడం దారుణమన్నారు. అనంతరం తహసీల్దారు గంగయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

జగన్‌కు రాజకీయ సమాధి తప్ప భవిష్యత్తులేదు

ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



ప్రొద్దుటూరు నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డికి రాజకీయ సమాధి తప్ప భవిష్యత్తులేదని ఎమ్మెల్యే వరద రాజుల రెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేక రులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అన్ని శాఖల్లో విపరీతమైన అవినీతి రాజ్యమేలిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి అనే మాట లేదన్నారు. కనీసం గ్రామాల్లో రోడ్డు కూడా వేయలేదన్నారు. టీడీపీ వచ్చి నాలుగునెలలు కాక ముందే ప్రభుత్వం మీద విపరీతంగా దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. సోషల్‌మీడియాలో పోస్టులు దారుణంగా పెడుతున్నారన్నారు. స్త్రీల మీద జరుగుతున్న అత్యాచారాలపై ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేలా సోషల్ మీడియాలో వైసీపీ పోస్టులు పెడుతోందన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి పేరిట జరిగిన అవినీతి కార్యక్రమాలన్నింటినీ వెలికితీస్తామన్నారు. జగన్ తన తల్లి,చెల్లినే ఆస్తుల కోసం రోడ్డుకు లాగారన్నారు. జగన్ తన సొంత బాబాయినే దారుణంగా హత్య చేయించారని ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

ముద్దనూరు నవంబరు8 (ఆంధ్రజ్యోతి):మండలంలో ఎన్‌పీఐ పథకంలో గృహనిర్మాణాలు చేస్తున్న లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈఈ రాజశేఖర్ తెలిపారు. మండల పరిధి మంగపట్నం గ్రామంలో శుక్రవారం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. వచ్చే ఏడాది మార్చి నెల చివరిలోపు ఇళ్లు పూర్తి చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ గురురాజ,సిబ్బంది పాల్గొన్నారు.

నిరక్షరాస్యులకు చదువు నేర్పించాలి

చాపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న నిరక్షరాస్యులకు అంగన్వాడీ కార్యకర్తలు, యానిమేటర్లు చదువు నేర్పించాలని రాయలసీమ జోన్ వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం అక్షరాస్యతపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కార్యకర్త, యానిమేటర్ వారి గ్రామాల్లో చదువు నేర్పించాలన్నారు. మార్చి వరకు నిరక్షరాస్యులకు నేర్పిస్తే ప్రభుత్వం వారికి ఒక సర్టిఫికెట్ ఇస్తుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో కానీ, ఇతరుల ఇళ్లలో కానీ ప్రతిరోజు సాయంత్రం అయిదు గంటల నుంచి 7 గంటల వరకు వారికి చదువు నేర్పించాలన్నారు. వయోజన విద్య కో-ఆర్డినేటర్ లక్షుమయ్య, ఎంపీడీవో వీరకిశోర్, ఐసీడీఎస్ చాపాడు సీడీపీవో సావిత్రి, సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, సుబ్బరత్న, అంగన్వాడీ కార్యకర్తలు, డ్వాక్రా యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

మహాసత్సంగ్‌కు ముఖ్యమంత్రికి ఆహ్వానం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్‌ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు పండిట్ రవిశంకర్ నిర్వహించే మహాసత్సంగ్‌లో పాల్గొనాలని చంద్రబాబును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అఫెక్స్ మెంబర్ మెట్టుపల్లి రామచంద్రారెడ్డి సతీమణి అనూరాధ ఆహ్వానించారు. శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి 13వ తేదీ సాయంత్రం విజయవాడలో జరిగే పండిట్ రవిశంకర్ మహాసత్సంగ్‌లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వామి నిర్మలానంద ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షకులు శ్రీనివాసరాజు, రామక్రిష్ణారెడ్డి, దుర్గ పాల్గొన్నారు.

ఆక్రమణలు ఇలా.. దారి ఎలా..?

● సన్నగిల్లిన వంద అడుగుల రహదారి ● పాదచారులు, వాహన చోదకుల అవస్థలు

● అధ్వానంగా వాసవీ సర్కిల్ - బొల్లవరంలోని జమ్మలమడుగు నాలుగు రోడ్ల కూడలి రోడ్డు





రోడ్డు పక్కనే పడవేసిన ఫ్లైయాష్ వ్యర్థాలు, ఆక్రమణలతో కుచించుకు పోయిన వంద అడుగుల వెడల్పు రోడ్డు

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు శివారులోని జమ్మలమడుగు బైపాస్ రహదారి ఆక్రమణలకు గురైంది. ఒకవైపు ఇరుకైన రోడ్డు, మరోవైపు దుమ్ము, ధూళి, వ్యాపార సముదాయాల ఆక్రమణలతో పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సరైన పారిశుధ్య చర్యలు చేపట్టకపోవడంతో రహదారి అంతా చినుకు పడితే చిత్తడిగా తయారవుతోంది. ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటేనే ప్రజలు హడలెత్తుతున్నారు. సుమారు వంద అడుగుల వెడల్పు ఉన్న ఈ రోడ్డు వాసవీ సర్కిల్ కూడలి నుంచి బొల్లవరంలోని జమ్మలమడుగు నాలుగు రోడ్ల కూడలి వరకు విస్తరించి ఉంది. ఈ రహదారి సోములవారిపల్లె పంచాయతీలోని ఈశ్వర్‌రెడ్డినగర్, పెన్నానగర్, దొరసానిపల్లె నివాస ప్రాంతాలను కలుపుతూ దగ్గరగా వెళుతోంది. పెన్నానగర్‌లో రహదారికి ఇరువైపులా ఇటుకల ఫ్యాక్టరీలు వీటిలో తయారైన వ్యర్థాలను రోడ్డు పక్కనే వేయడంతో రహదారి వెంబడి ప్రయాణించే వాహన చోదకులు దుమ్ము, ధూళి బారిన పడుతున్నారు. ఈ రహదారికి రెండువైపులా పలువురు వ్యాపారులు తమ అవసరాల కోసం ముందు భాగాలను ఆక్రమించడంతో రోడ్ల వెడల్పు తగ్గి భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. బీరువా తయారీ ఫ్యాక్టరీలు, ఫ్లైయాష్ వేస్టేజీ, ప్లాస్టిక్ చెత్తసేకరణ వ్యాపారులు ఇలా ఒకరేంటి చాలా మంది వ్యాపారులు రోడ్డును ఆక్రమించుకున్నారు. దీంతో ఈ రహదారిలో ప్రయాణం ఇరుకై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

నిత్యం వందలాది సంఖ్యలో భారీ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండడంతోపాటు పెద్ద ఎత్తున దుమ్ము, ధూళి రావడంతో వెనుక వచ్చే వాహనదారులకు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతోంది. రహదారి వెంబడి ఉన్న ఆక్రమణలు తొలగించి రోడ్డు ఇరువైపులా పరిశుభ్రంగా ఉంచి పాదచారులు, వాహన చోదకులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'విద్యుత్ అంతరాయాలను జీరో చేయాలి'



పోరుమామిళ్ల... సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ రమణ

పోరుమామిళ్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అంతరాయాలను జీరో చేయాలి, ప్రమాద నివారణ లక్ష్యంగా ముందుకు వెళ్లాలని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ ఎస్.రమణ అన్నారు. శుక్రవారం ఆయన బి.కోడూరు మండలంలోని 32/11 కేవీ, పాయిలకుంట్ల సబ్ స్టేషన్ తదితర ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను లైన్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం పోరుమామిళ్ల సబ్‌డివిజను విద్యుత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పగటిపూట లైట్లు వెలగకుండా చర్యలు తీసుకుని విద్యుత్ వృథాను అరికట్టాలన్నారు. సమస్యలు గుర్తించి ముందస్తు మరమ్మతులు చేసి అంతరాయాన్ని అరికట్టి నాణ్యమైన విద్యుత్‌అందించాలన్నారు. లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా అవసరమైన కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. లూజులైన్లు సరి చేయాలని తక్కువ ఎత్తులోని లైన్లను గుర్తించి యుద్ధప్రాతి పదికన చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల విద్యుత్ సమస్యలపై అత్యధికంగా దృష్టి సారించాలన్నారు. రైతుల విద్యుత్ సమస్యలైన ట్రాన్స్‌ఫార్మర్లకు ఫీజులు వేయడం, కాలిపోయినప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లు మార్చిన పనులపై వెంటనే స్పందించాలన్నారు.

ఈ కార్యక్రమంలో మైదుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు భరణీక్రిష్ణ, పోరుమామిళ్ల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రవిచంద్ర, పోరుమామిళ్ల ఏఈ వెంకటమహేశ్, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బికోడూరు మండలాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు..: ఫిర్యాదులు లేని సేవలను అందించాలని, నిర్లక్ష్యంగా ఉండరాదని ఏపీఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ పేర్కొన్నారు. శుక్రవారం మైదుకూరులోని కార్యాలయంలో మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని మైదుకూరు, బద్వేలు నియోజకవర్గం పరిధిలోని మండల స్థాయి అధికారులతో ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ పరిధి లోని ఏఈలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ముద్దనూరు, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం ఏవో వెంకటకృష్ణారెడ్డి తనిఖీ చేశారు. సాధారణ తనిఖీలో భాగంగా స్టాక్ నమోదును పరిశీలించారు. గోడౌన్‌లో నిల్వ చేసిన ఎరువులను పరిశీలించి, ఎరువులు, పురుగు మందు, విత్తనాలను ప్రయోగశాలకు పరిశీలన నిమిత్తం నమూనాలను సేకరించారు. నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

వీరభద్రుని ఆదాయం రూ.10 లక్షలు

చాపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అల్లాడుపల్లె వీరభద్ర స్వామికి భక్తుల నుంచి రూ.10,19,084 ఆదాయం వచ్చినట్లు ఆ దేవస్థానం ఈవో మారుతీప్రసాద్ పేర్కొన్నారు. దేవాలయంలో శుక్రవారం అధికారులు హుండీలను లెక్కించారు. ఆరు నెలల నుంచి భక్తులు స్వామివారికి వేసిన కానుకలు లెక్కించామన్నారు. తహసీల్దారు రమాకుమారి డబ్బు లెక్కింపును పర్యవేక్షించారు.

మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

చాపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణానికి చెందిన శ్రీనివాసులు గౌడ్ అనే వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని కేతవరం గ్రామానికి చెందిన ప్రొద్దుటూరు ఖాదర్‌వలి అనే వ్యక్తి వద్ద నుంచి బాయిలర్ కోళ్లు పలు విడతలుగా సుమారు వెయ్యి అప్పుగా శ్రీనివాసులుగౌడ్ కొనుగోలు చేశారన్నారు. కానీ డబ్బులు ఇవ్వకుండా మోసం చేసినట్లు తెలిపారు. 2020 నుంచి 2022 వరకు పలు దఫాలుగా కొనుగోలు చేసి మొత్తం రూ.1.90 లక్షలు బాకీ ఇవ్వలేదన్నారు. ఈ బాకీని చెల్లించాలని అతనిని ఖాదర్‌వలి అడుగగా చంపుతామని బెదిరించినట్లు చెప్పారు. దీంతో ఖాదర్‌వలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


మైలవరం జలాశయంలో నూతన బోటింగ్ ప్రారంభం



బోట్‌లో ప్రయాణం చేస్తున్న భూపేశ్‌రెడ్డి

మైలవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పర్యాటకం అభివృద్ధిలో భాగంగా మైలవరం జలాశయంలో త్రిమూర్తులకోన సమీపంలో శుక్రవారం నూతన బోటింగ్‌ను జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి పెద్ద పీట వేస్తోందన్నారు. అందులో భాగంగానే జమ్మలమడుగు నియోజకవర్గాన్ని పర్యాటక కేంద్రంగా చేయడమే లక్ష్యమన్నారు. పర్యాటకులు, ప్రజలకు బోటు షికారు చేసే అవకాశం ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన అధికారులతో కలిసి మైలవరం జలాశయంలో బోటు షికారు చేశారు. ఈ కార్యక్రమంలో జలాశయ డీఈఈ నరసింహమూర్తి, ఏపీ టూరిజం జిల్లా అధికారి మల్లికార్జున గౌడ్, ఎస్ఐ శ్యాం సుందర్ రెడ్డి, ఎంపీటీసీ బాలకొండయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో రాణించాలి



విద్యార్థిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైఫిల్ షూటింగ్‌లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపరచిన షేక్ మహమ్మద్ ఉబైద్ మరింత కృషి, పట్టుదలతో జాతీయస్థాయిలో రాణించాలని శ్రీచైతన్య హైస్కూలు ఏజీఎం ఎస్.నాగిరెడ్డి పేర్కొన్నారు. రైఫిల్ షూటింగ్‌లో రాష్ట్రస్థాయిలో జరిగిన వివిధ కేటగిరిల్లో పాల్గొని స్వర్ణపతకాల పంట పండించిన మహమ్మద్ ఉబైద్ ప్రతిభపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో శుక్రవారం గురిపెడితే... పతకమే... అనే శీర్షిక ప్రచురితమైంది. దీంతో విద్యార్థి షేక్ మహ్మద్ ఉబైద్‌ను పాఠశాల యాజమాన్యం శుక్రవారం సాయంత్రం శాలువా కప్పి మెమెంటోను అందించారు. పాఠశాల కో- ఆర్డినేటర్ మురళీధర్ రావు, ఇన్‌చార్జి విశ్వనాథ్ తదితరులు విద్యార్థిని అభినందించారు.

వీరబ్రహ్మేంద్రస్వామిదేవస్థానం అభివృద్ధికి కృషి



ఎస్‌బీఐ క్యూఆర్ కోడ్ స్కానర్‌యాప్‌ను ప్రారంభిస్తున్న ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ

బ్రహ్మంగారిమఠం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానం అభివృదికి ప్రజలు, భక్తుల సహాయ సహకారాలతో అభివృద్ధికి కృషి చేస్తానని దేవస్థానం ఫిట్‌పర్సన్‌సి.శంకర బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం భక్తుల సౌకర్యార్థం దేవ స్థానం అభివృద్ధి పనుల కోసం ఆలయ ప్రాంగణంలో స్టేట్‌బ్యాంకు యాప్ క్యూఆర్ కోడ్ యాప్‌ను ప్రారంభించారు. ఎవరైనా భక్తులు తమ కానుకలను చెల్లించాలనుకుంటే ఆలయ ప్రాంగణంలో స్టేట్‌బ్యాంకు తరపున మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠం పేరు మీద యాప్ ఉందని భక్తులు క్యూఆర్ కోడ్ ద్వారా తమ విరాళాలు నేరుగా పంపవచ్చని ఆయన తెలిపారు. అనంతరం ఉద యం ఆలయ ప్రాంగణంలో క్యూఆర్ కోడ్‌ను యాప్ ప్రారంభించారు. కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతి కుటుంబ సభ్యులు, మేనేజరు ఎస్.ఈశ్వరయ్యాచారి దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

జమ్మలమడుగు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో శుక్రవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆరుగురికిపైగా మట్కా బీటర్లను అరెస్టు చేసి అర్బన్ పోలీసు స్టేషన్‌కు రాత్రి 7.30 గంటల సమయంలో తీసుకెళ్లినట్లు తెలిసింది. 'ఆంధ్రజ్యోతి' అర్బన్ సీఐ లింగప్పను వివరాలు అడుగగా మట్కా బీటర్లు పట్టుబడితే తెలియజేస్తామని ఆయన తెలిపారు.


ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కొండాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటిపల్లె గ్రామానికి చెందిన ఎర్రగుంట్ల వెంకటేష్‌వర్మపై కులం పేరుతో దూషించి, దాడి చేసినందుకు ఇద్దరిపై పోలీసులు శుక్రవారం ఎస్సీఎస్టీ కేసు నమోదు చేశారు. వెంకటేష్‌వర్మను కొండాపురంలోని స్థలం విషయంలో క్రొరపాడుకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి కులం పేరుతో దాడి చేసి దూషించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు ఆఇద్దరి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు.

అన్నిరకాల ఎరువులు అందుబాటులో ఉంచండి : ఎంపీపీ

బి.కోడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో అన్నిరకాల ఎరువులను అందుబాటులో ఉంచాలని ఎంపీపీ కోడూరు చెన్నమ్మ తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ చెన్నమ్మ అధ్యక్షతన ఎంపీడీవో భాస్కర్‌రావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధి ఈసీ ఖాజా మాట్లాడుతూ రైతులు అన్నిరకాల పండ్ల తోటలు పెంచుకునేందుకు ప్రభుత్వం మంజూరు చేసిందని ఆసక్తి ఉన్న రైతులు ఉపాధిసిబ్బందిని సంప్రదించి పండ్ల మొక్కలు నాటుకోవాలన్నారు. అలాగే పశుగ్రాస పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.వర్షం నీరు భూమిలో ఇంకేందుకు ఇళ్లపై పడ్డ వర్షం నీటిని ఇంటి ఆవరణంలో గుంతలు ఏర్పాటు చేసుకుంటే ఒక్కో దానికి ప్రభుత్వం రూ.6వేలు మంజూరు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో తహసీల్దారుమధునాయక్, వైద్యాధి కారి వినీత్‌కుమార్ రాజు,మండల ఉపాధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ దావీదు, వైస్‌ప్రెసిడెంట్ మాధవరెడ్డి,శేఖర్‌రెడ్డి,ఎంపీటీసీ రామకోటి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'జగన్‌కు మహిళలంటే గౌరవం లేదు'



మునిశేఖర్‌రెడ్డి

చాపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జగన్‌కు మహిళలంటే గౌరవం లేదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి అన్నారు.మహిళలు, బాలికల ఫొటోలను మార్ఫింగ్ చేసి వైసీపీ కార్యకర్తలు, నేతలు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం నీచమైన సంస్కృతి అన్నారు. జగన్ మహిళలను వేధించే సైకోలకు సపోర్టు చేయవద్దన్నారు. ఇలా చేస్తే 2029లో జరిగే ఎన్నికల్లో వైసీపీ తరుపున పోటీ చేసే అభ్యర్థులు దొరకరన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

అలవలపాటి ముకుందారెడ్డి,ఎంపీడీవో



ముఖాముఖి

ముద్దనూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాం.ఆ దిశగా అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులకు ఆదేశాలు జారీచేశాం.విషజ్వరాలు వస్తున్నం దున ఎక్కడైన పారిశుధ్య లోపం ఉంటే చర్యలు కఠినంగా ఉంటాయి.గ్రామ కార్యదర్శులు, ఆరోగ్యసిబ్బంది సమన్వయంతో ఎప్పటికప్పుడు గ్రామంలో ప్రజల సమస్యలపై స్పందించాలని తెలియజేశాం.ఉపాధి హామీ కూలీలకు పనులు గుర్తించాం.వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశాం.మండల ప్రజలకు పారిశుధ్య, తాగునీరు,ఇతర సమస్యలు ఉంటే తమ దృష్టికి తెచ్చిన పరిష్కరిస్తామంటున్న ఎంపీడీవో అలవలపాటి ముకుందారెడ్డితో ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూ...

ప్రశ్న:మండలంలో పారిశుధ్యంపై ఎటువంటి చర్యలు చేపడుతున్నారు ?

జవాబు:ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నాం.మురుగు కుంటలు, కాల్వలు ఉన్న చోట దోమలు వ్యాప్తి చెందకుండా, ఆయిల్ బాల్స్ వేస్తున్నాం.అలాగే బ్లీచింగ్ చల్లిస్తున్నాం.నీటి తొట్లు శుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచిస్తున్నాం.

ప్రశ్న:గ్రామాల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నారా ?

జవాబు: అన్ని గ్రామాల్లో పల్లె పండుగలో భాగంగా సీసీ రోడ్లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టాం.సీసీ రోడ్లకు భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించాం. త్వరలో పనులు కూడా ప్రారంభమవుతాయి.

ప్రశ్న: పింఛన్ల పంపిణీ ఎలా చేస్తున్నారు?

జవాబు:వృద్ధాప్య, వికలాంగ, వితంతు అన్నీ పింఛన్లు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేస్తున్నాం.ఒకటో తేదీ తెల్లవారుజామముననే లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పింఛ న్లు అందిస్తున్నాం.

ప్రశ్న: కొత్త ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు?

జవాబు: కొత్త ప్రభుత్వం ఇచ్చిన నిర్మాణాలు పూర్తి చేస్తున్నాం.ఆ దిశగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి.మండలంలో లబ్ధిదారులు మంజూరు చేసిన 995 ఇళ్లకు గాను 609 ఇళ్లు పూర్తయ్యాయి.ఇంకా 386 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి.వారి వద్దకు వెళ్లి, నోటీసులు ఇచ్చి ఇళ్లు పూర్తి చేసుకోవాలని అవగాహన కల్పించాం.వచ్చే ఏడాది మార్చి ఒకటో తేదీలోపు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి. పేమెంట్ కూడా చెల్లించేందుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి.

ప్రశ్న: ఉపాధి హామీ కూలీలకు పనులు ఎలా కల్పిస్తున్నారు?

జవాబు:ప్రస్తుతం హార్టీకల్చర్ పనులు జరుగుతున్నాయి. 68 ఎకరాల్లో చీనీ సాగుపనులు జరుగుతున్నాయి.త్వరలో సీసీ రోడ్లు,ఇంకుడు గుంతలు, ఫారంపాండ్, కందకాల తవ్వకాలు,గోకులాల ఏర్పాటు పనులు కూలీలకు కల్పిస్తాం.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎర్రగుంట్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండల పరిధిలోని వివిధ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ కిరణ్‌కుమార్ తెలిపారు. కోగటం, కేవీపల్లి, మాలేపాడు, చిన్న దండ్లూరు, ఆర్‌పీపీ ,సిరిగేపల్లి, చిలమకూరు, కలమల్ల సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉంటుంద న్నారు. వినియోగదారులందరూ గమనించి అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

ముద్దనూరు..: మండలంలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో వినియోగదారులకు శనివారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరాజవర్మ తెలిపారు.సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గుర్తించాలన్నారు.

షర్మిలను కలిసిన కమలమ్మ

పోరుమామిల్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైఎస్ షర్మిలను బద్వేలు మాజీ ఎమ్మెల్యే పీఎం కమలమ్మ కలిశారు. శుక్రవారం విజయవాడలోని ఆంధ్రభవనంలో జరిగిన సమావేశానికి ఆమె హాజరై మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ప్రెసిడెంట్ జె.ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.